భారతరత్న స్వామినాథన్‌కు జేజేలు!



చెన్నై, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): 'భారత హరిత విప్లవ పితామహుడు' దివంగత డాక్టర్ ఎంఎస్ స్వామినాథన్‌కు 'భారతరత్న' ఇవ్వడం పట్ల రాష్ట్రవ్యాప్తంగా హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. స్వామినాథన్ గత ఏడాది సెప్టెంబరు 28న తన 98వ యేట కన్నుమూసిన విషయం తెలిసిందే. ప్రపంచం నుంచి ఆకలి రక్కసిని తరిమేసేందుకు స్వామినాథన్ జీవితాంతం పోరాడగా, ఆయన చెన్నైలో స్థాపించిన 'ఎంఎస్ స్వామినాథన్ రీసెర్చ్ ఫౌండేషన్' హరిత విప్లవంలో భాగంగా రకరకాల ప్రయోగాలు కొనసాగిస్తోంది. ఎంఎస్ స్వామినాథన్‌గా ప్రపంచానికి చిరపరచితులైన ఆయన పూర్తి పేరు 'మాన్‌కొంబు సాంబశివన్ స్వామినాథన్'. తిరుచ్చి జిల్లా కుంభకోణంలో 1925 ఆగస్టు 7న డాక్టర్ ఎంకే సాంబశివన్, పార్వతి తంగమ్మాళ్ దంపతులకు జన్మించిన ఆయన.. కుంభకోణంలోని కేథలిక్ లిటిల్ ఫ్లవర్ హైస్కూల్లో ప్లస్‌టూ వరకు చదివారు. తిరువనంతపురం మహారాజ కళాశాలలో జంతుశాస్త్రంలో పట్టభద్రులయ్యారు. స్వామినాథన్ తండ్రి వైద్యుడు. స్వామినాథన్ కూడా తన లాగే వైద్యవృత్తిని స్వీకరించి, తన వైద్యశాల బాధ్యతలు నిర్వర్తించాలని ఆయన కోరుకునేవారు. అయితే అప్పట్లో బెంగాల్‌లో ఏర్పడిన విపరీతమైన కరవు పరిస్థితులు స్వామినాథన్‌పై తీవ్ర ప్రభావం చూపాయి. దీంతో ఆయన దృష్టి వ్యవసాయ రంగంపైకి మళ్లింది.

మా నాన్నకు అరుదైన గౌరవం

ప్రపంచ వ్యాప్తంగా ఆహారం, పోషకాహార భద్రతా సమస్యను పరిష్కరించేందుకు జీవితాంతం తన తండ్రి ఎంఎస్ స్వామినాథన్ చేసిన కృషికి ఇదొక గొప్ప గౌరవం, గుర్తింపుగా భావిస్తున్నట్లు ఆయన కుమార్తె ఎంఎస్ స్వామినాథన్ రీసెర్చ్ ఫౌండేషన్ చైర్ పర్సన్ డాక్టర్ సౌమ్య స్వామినాథన్ పేర్కొన్నారు. శుక్రవారం ఆమె స్వామినాథన్‌కు భారతరత్న రావడంపై స్పందిస్తూ.. మరణానంతరం కూడా తన తండ్రికి భారతరత్న ప్రకటించినందుకు కేంద్రప్రభుత్వానికి, ప్రధాని నరేంద్రమోదీకి కృతజ్ఞతలు తెలిపారు. తన తండ్రి వేలాదిమంది యువ శాస్త్రవేత్తలకు మార్గదర్శకుడన్నారు. మానవాళికి సేవ, సామాజిక సేవలను పరిష్కరించేందుకు సైన్స్, టెక్నాలజీ శక్తిని ఉపయోగించాలని గట్టిగా విశ్వసించేవారన్నారు.

11 ఏళ్ల వయసులో...

స్వామినాథన్ 11 యేళ్ల వయస్సులో ఉండగా ఆయన తండ్రి కన్నుమూశారు. పినతండ్రి సంరక్షణలో పెరిగిన ఆయన.. వ్యవసాయ రంగంలో పరిశోధనలు చేయాలని భావించారు. 1940-44లో మద్రాస్ వ్యవసాయ కళాశాలలో చేరి వ్యవసాయ శాస్త్రంలో పట్టభద్రులయ్యారు. ఆ తర్వాత ఢిల్లీలో జన్యు పంటల పరిశోధనలకు సంబంధించి ప్రథమశ్రేణిలో పోస్టుగ్రాడ్యుయేట్ డిగ్రీని పొందారు. 1948లో ఐపీఎస్‌కు ఎంపికయ్యారు. కానీ పోలీసుశాఖలో చేరలేక, పలు పరిశోధన సంస్థల్లో పనిచేశారు. కేంబ్రిడ్జి విశ్వవిద్యాలయంలో పీహెచ్‌డీ పొందారు. కొన్ని వందల పరిశోధనలకు ఆయన కేంద్రబిందువయ్యారు. వ్యవసాయ పరిశోధనలపై అనేక గ్రంథాలను రచించారు. అమెరికాలోని విస్కాన్సిన్ వర్శిటీలో ఉద్యోగం లభించినా స్వదేశానికి తిరిగొచ్చారు. ఒడిశా రాష్ట్రం కటక్‌లోని వ్యవసాయ విశ్వవిద్యాలయంలో ప్రొఫెసర్‌గా విధులు నిర్వర్తించారు. 1960 దశకంలో దేశంలో కరవు పరిస్థితులు తీవ్రరూపం దాల్చడంతో, అమెరికా నుంచి గోధుమను దిగుమతి చేసుకునేవారు. భారతీయులు క్షుద్బాధతో అల్లాడిపోవడం ఖాయమని యావత్ప్రపంచం భావిస్తున్న తరుణంలో స్వామినాథన్ కొత్త ప్రయోగానికి నాంది పలికారు. జపాన్‌లో కొత్తగా కనుగొన్న గోధుమ వంగడాన్ని దేశంలో ప్రవేశపెట్టి, అధిక ఉత్పత్తిని, 200 శాతం లాభాలను సాధించేందుకు దోహదపడ్డారు. ఈ విప్లవాన్నే 'గోధుమ విప్లవం' అని నాటి ప్రధాని ఇందిరాగాంధీ స్వామినాథన్ సేవలను వేనోళ్ల కొనియాడారు. ఇదే విధంగా చైనా వరి వంగడాలను కూడా దేశంలో ప్రవేశపెట్టి వరిధాన్యాల ఉత్పత్తిని అధికం చేశారు. ఆహార ధాన్యాల ఉత్పత్తిలో దేశం స్వయం స్వమృద్ధిని సాధించేందుకు కృషి చేశారు. ఆహారధాన్యాలను దిగుమతి చేసుకునే దుస్థితిని తప్పించి వ్యవసాయోత్పత్తులను ప్రపంచ దేశాలకు ఎగుమతి చేసేలా వ్యవసాయ రంగాన్ని తీర్చిదిద్దిన ఘనత స్వామినాథన్‌కే దక్కుతుంది. బంగాళా దుంపల ఉత్పత్తిని పెంచడంలోనూ ఆయన కీలకపాత్ర పోషించారు. పస్తులు లేని భారతదేశమే తన సంకల్పమంటూ ప్రకటించిన స్వామినాథన్ 1980లలో 'ఎంఎస్ స్వామినాథన్ రీసెర్చ్ ఫౌండేషన్'ను స్థాపించారు.

ఎన్నో పదవులు...

పేరుగడించిన పరిశోధన సంస్థల్లో ప్రొఫెసర్‌గా, పరిశోధకుడిగా, విభాగాధిపతిగా ఎన్నో పదవులను అధిరోహించిన స్వామినాథన్‌ను దేశవిదేశాల్లోని వర్శిటీలకు చెందిన 84 గౌరవ డాక్టరేట్లు, వందలాది అవార్డులు వరించాయి. గ్రామీణ ప్రజల అభివృద్ధి, వ్యవసాయ పరిశోధనలకు గాను కొలంబియా విశ్వవిద్యాలయం ఆయనను 'వాల్వో' బిరుదుతో సత్కరించింది. 'రామన్ మెగసెసే' అవార్డు కూడా ఆయన్ని వరించింది. కేంద్ర వ్యవసాయ శాఖ కార్యదర్శిగా, కేంద్ర ప్రణాళికా సంఘం సభ్యుడిగా సేవలందించారు. దేశంలోని వివిధ వైజ్ఞానిక సంస్థల సభ్యుడిగా విశిష్టసేవలందించారు. వ్యవసాయ రంగంలో పునరుజ్జీవనాన్ని తీసుకొచ్చిన ఆహారధాన్యాల ఉత్పత్తిలో దేశాన్ని స్వయంసమృద్ధిగా తీర్చిదిద్దిన ఘనత ఆయనదే. ఆయనకు పద్మశ్రీ (1967), పద్మభూషణ్ (1972), పద్మవిభూషణ్ (1989) అవార్డులు వచ్చాయి. ఇప్పుడు 'భారతరత్న' కూడా రావడంతో కేంద్రప్రభుత్వం అందించే అన్ని అవార్డులను పొందిన వ్యక్తిగా ఎంఎస్ స్వామినాథన్ రికార్డులకెక్కారు. ఆయన 2007-13 వరకు రాజ్యసభ సభ్యుడిగా వ్యవహరించారు.

నాన్ ముదల్వన్ పథకం

లబ్ధిదారులకు ఉద్యోగావకాశాలు

సీఎం స్టాలిన్ ప్రకటన

నాన్‌ముదల్వన్ పథకం వార్షికోత్సవంలో యూపీఎస్సీ పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థినికి రూ.25వేల ప్రోత్సాహక నగదును అందజేస్తున్న ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ (ఫైల్ ఫొటో)



చెన్నై, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులను పోటీ పరీక్షలకు సిద్ధం చేయడం కోసం తాను ప్రారంభించిన 'నాన్ ముదల్వన్' పథకం ద్వారా శిక్షణ పొందిన వేలాది మంది అభ్యర్థులు ప్రభుత్వ రంగ సంస్థలు, ప్రైవేటు కంపెనీలు, బహుళజాతి సంస్థల్లో ఉద్యోగావకాశాలు పొందారని ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ పేర్కొన్నారు. ఈ మేరకు ఆంగ్ల దినపత్రికలలో వెలువరించిన ఓ వార్తను ఉటంకిస్తూ మరో రెండు నెలల్లో కృష్ణగిరి, సేలం, అరియలూరు, కళ్లకురిచ్చి జిల్లాలకు చెందిన విద్యార్థులకు ప్లేస్‌మెంట్ కార్యక్రమాలు నిర్వహించనున్నామని పేర్కొన్నారు. ఇప్పటికే ఆర్ట్స్ అండ్ సైన్స్ విభాగం విద్యార్థులు మంచి వేతనాలతో ఉద్యోగం సంపాదించుకుంటున్నారని చెప్పారు. నాన్ ముదల్వన్ పథకం విద్యార్థి లోకానికి ఇంతటి ప్రయోజనం కలిగిస్తుందని తాను కూడా ఊహించలేదని స్టాలిన్ తన ఎక్స్ పేజీలో ఓ సందేశం వెలువరించారు.

పెరియార్ వర్శిటీ రిజిస్ట్రార్

సస్పెన్షన్



తంగవేల్

పెరంబూర్, ఫిబ్రవరి 9: సేలం పెరియార్ విశ్వవిద్యాలయంలో అవినీతికి పాల్పడ్డారంటూ రిజిస్ట్రార్ తంగవేలుపై వచ్చిన ఆరోపణలు నిర్ధారణ కావడంతో ఆయన్ని ఆ పదవి నుంచి సస్పెండ్ చేయాలని వైస్ ఛాన్సలర్‌ను రాష్ట్రప్రభుత్వం ఆదేశించింది. పెరియార్ వర్శిటీ రిజిస్ట్రార్ పలు అవకతవకలకు పాల్పడ్డారని ఫిర్యాదులున్నాయి. వాటిపై విచారణకు విద్యాశాఖ అదనపు కార్యదర్శి పళనిస్వామి, జాయింట్ కార్యదర్శి హెన్రీదాస్‌తో కూడిన ద్విసభ్య కమిటీని 2022 డిసెంబరులో నియమించారు. ఏడాదిన్నర కాలంగా ఈ కమిటీ విచారణ చేపట్టింది. ఫిర్యాదు చేసిన వారిని ఐదుసార్లు స్వయంగా పిలిపించి విచారించడంతో పాటు ఆధారాలు సేకరించింది. ఆ నివేదికను పళనిస్వామి కమిటీ ప్రభుత్వానికి అందజేసింది. ఈ నివేదికలో రిజిస్ట్రార్ అవినీతికి పాల్పడినట్లు నిర్ధారణ అయిందని తేలింది. రిజిస్ట్రార్ తంగవేల్ తొలుత నకిలీ సర్టిఫికెట్లతో కంప్యూటర్ విభాగం ప్రొఫెసర్‌గా చేరినట్లు, రిజిస్ట్రార్ అయిన తర్వాత దళిత విద్యార్థుల నైపుణ్య శిక్షణ నిధులు సుమారు రూ.2 కోట్ల మేర, కంప్యూటర్ విభాగానికి ఉపకరణాల కొనుగోలులో, వర్శిటీ కార్యాలయంలో డిజిటలైజేషన్ ప్రక్రియలో అవినీతికి పాల్పడ్డారని నివేదికలో పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో, మరో కొద్ది రోజుల్లో పదవీ విరమణ చేయనున్న ఆయన్ను సస్పెండ్ చేయాలని రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ ప్రధాన కార్యదర్శి కార్తీక్ ఉత్తర్వులు జారీ చేశారు.

రేపు చెన్నైకి జేపీ నడ్డా

రాష్ట్ర బీజేపీ నేతలతో కీలక సమావేశం



అడయార్, ఫిబ్రవరి 9: భారతీయ జనతా పార్టీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా ఆదివారం చెన్నైకి రానున్నారు. త్వరలో జరగనున్న పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఆయన పర్యటనకు ఎనలేని ప్రాధాన్యం నెలకొంది. ఈ సందర్భంగా ఆయన రాష్ట్ర బీజేపీ శాఖకు చెందిన కీలక నేతలతో సమావేశమై చర్చలు జరిపే అవకాశం ఉంది. గత అసెంబ్లీ ఎన్నికల్లో అన్నాడీఎంకేతో కలిసి బీజేపీ పోటీ చేసింది. ఆ తర్వాత బీజేపీతో పొత్తు తెంచుకుంటున్నట్లు అన్నాడీఎంకే ప్రకటించింది. అదేసమయంలో బీజేపీ కూటమిలో ఉన్న డీఎండీకే, టీఎంసీ, పుదియ తమిళగం వంటి పార్టీలు కూడా ఇపుడు పొత్తుల విషయంలో ఆచితూచి అడుగులు వేస్తున్నాయి. ఈ నేపథ్యంలో జేపీ నడ్డా రాష్ట్ర పర్యటనకు వస్తున్నారు. నగరానికి వచ్చే ఆయనకు బీజేపీ శ్రేణులు ఘనంగా స్వాగతించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ సందర్భంగా ఆయన ఒక బహిరంగ సభలో కూడా పాల్గొని ప్రసంగించనున్నారు. ఈ పర్యటనలో ఆయన తొలుతు కాట్టాన్‌కొళత్తూరులో రాష్ట్ర నిర్వాహకులు, లోక్‌సభ నియోజకవర్గాల ఇన్‌చార్జులు, అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జులతో సమావేశమవుతారు. అలాగే, రాష్ట్రంలో ఏర్పాటు చేసిన బీజేపీ ఎన్నికల మేనిఫెస్టో రూపకల్పన కమిటీ, ఐటీ వింగ్, యువజన విభాగం, న్యాయవాదుల విభాగం ఇలా మొత్తం 38 శాఖలతో ఆయన సమావేశంకానున్నారు. అలాగే, పార్టీలో చేరికలు, పార్టీ సభ్యత్వం తదితర అంశాల గురించి ఆయన పార్టీ రాష్ట్ర నేతలతో చర్చించనున్నారు. ఆ తర్వాత స్థానిక కీల్పాక్కంలోని ఒక పాఠశాల మైదానంలో జరిగే బహిరంగ సభలో ఆయన పాల్గొని ప్రసంగించనున్నారు.

అత్తికడవు - అవినాశి పథకం

బుట్టదాఖలు

ఈపీఎస్ ఆరోపణ ● డీఎంకే ఎంపీ రాజా వైఖరికి నిరసనగా ధర్నా

అవినాశిలో జరిగిన ధర్నాలో ప్రసంగిస్తున్న ఈపీఎస్



చెన్నై, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): అన్నాడీఎంకే ప్రభుత్వ హయాంలో ప్రారంభించిన అత్తికడవు - అవినాశి పథకాన్ని, మహిళల మంగళసూత్రానికి బంగారం, విద్యార్థులకు ల్యాప్‌టాప్‌ల పంపిణీ వంటి కీలకమైన సంక్షేమ పథకాలను డీఎంకే ప్రభుత్వం బుట్టదాఖలు చేసిందని అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి, మాజీ సీఎం ఈపీఎస్ ధ్వజమెత్తారు. అన్నాడీఎంకే వ్యవస్థాపకుడు, దివంగత మాజీ ముఖ్యమంత్రి ఎంజీఆర్‌ను కించపరిచేలా విమర్శించిన డీఎంకే ఎంపీ ఎ.రాజా వైఖరిని ఖండిస్తూ నీలగిరి లోక్‌సభ నియోజకవర్గం పరిధిలోని తిరుప్పూరు జిల్లా అవినాశిలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... అవినీతి అక్రమాలకు నిలువెత్తు సాక్ష్యంగా ఉన్న డీఎంకే ఎంపీ రాజా, ఆ పార్టీ నాయకులకు నిజాయితీకి మారుపేరైన మాజీ ముఖ్యమంత్రి ఎంజీఆర్ పేరును కూడా ప్రస్తావించే అర్హత లేదన్నారు. ఎంజీఆర్‌ను కించపరిచేలా విమర్శలు చేసిన రాజాను లోక్‌సభ ఎన్నికల్లో ప్రజలు ఓడించడం ఖాయమన్నారు. మూడు దశాబ్దాల పాటు సాగిన అన్నాడీఎంకే పాలనే రాష్ట్ర ప్రజలకు స్వర్ణయుగమని, తమ పాలనలోనే రాష్ట్రం పురోగతి సాధించిందని ఈపీఎస్ అన్నారు. అత్తికడవు - అవినాశి పథకానికి రూ.1524 కోట్ల నిధులు కేటాయించి 90 శాతం పనులు పూర్తయినా తక్కిన 10 శాతం పనులు చేయకుండా డీఎంకే ప్రభుత్వం ఆ పథకాన్ని బుట్టదాఖలు చేసిందన్నారు. కొత్తపరిశ్రమలు ప్రారంభిస్తామంటూ గొప్పలు చెప్పుకుంటున్న డీఎంకే ప్రభుత్వం విద్యుత్ చార్జీలను పెంచి తిరుప్పూరు, కోయంబత్తూరు జిల్లాల్లో చిన్న, మధ్యతరహా, కుటీర పరిశ్రమలను మూతపడేలా చేసిందన్నారు. ఇక అన్నాడీఎంకే ప్రభుత్వం ప్రారంభించిన ప్రజా సంక్షేమ పథకాలకు డీఎంకే స్టిక్కర్లు అతికించి తానే ప్రారంభించినట్లు సీఎం స్టాలిన్ గొప్పలు చెప్పుకోవడం విడ్డూరంగా ఉందన్నారు. ఇక రాష్ట్రంలో శాంతి భద్రతలు క్షీణించాయని, హత్యలు, అత్యాచారాలు, దారిదోపిడీలు అధికంగా జరుగుతున్నా పోలీసులు పట్టించుకోవడం మానేశారన్నారు. రాష్ట్రంలో వృద్ధులను హతమార్చి వారి అవయవాలను అపహరించే సంఘటనలు వెలుగు చూస్తుండడంతో పోలీసు వ్యవస్థ పతనావస్థకు చేరిందనే దానికి నిదర్శనమన్నారు. కోయంబత్తూరు నగరంలో మెట్రోరైలు ప్రాజెక్టును అమలు చేయడానికి అన్నాడీఎంకే ప్రభుత్వం ప్రతిపాదించిందని, డీఎంకే ప్రభుత్వం ఆ పథకాన్ని చేపట్టేందుకు తటపటాయిస్తోందన్నారు. ఇటీవల 11 రోజులపాటు స్పెయిన్‌లో గడిపిన సీఎం స్టాలిన్ మూడు కంపెనీలతో మాత్రమే కొత్త ఒప్పందాలు కుదుర్చుకున్నారని, తక్కినవన్నీ రాష్ట్రంలో ఉత్పత్తులు చేస్తున్న కంపెనీలేనని ఈపీఎస్ గుర్తు చేశారు. స్టాలిన్ స్పెయిన్ పర్యటనపై, పెట్టుబడుల సేకరణపై శ్వేతపత్రం జారీ చేయాలని డిమాండ్ చేశారు. ఎస్పీ వేలుమణి, సెంగోటయ్యాన్, వేలుసామి, శాసనసభ్యులు పీఆర్జీ అరుణకుమార్, అమ్మన్ కే అర్జునన్, పొల్లాచ్చి జయరామన్, ఏకే సెల్వరాజ్, ధనపాల్, వీపీ కందసామి, కేఆర్ జయరామ్, అముల్ కందసామి, దామోదరన్, ఉడుమలై రాధాకృష్ణన్ తదితరులు పాల్గొన్నారు.

పితృదేవతలకు తై అమావాస్య తర్పణాలు

రామేశ్వరం సహా తీర్థక్షేత్రాలకు పోటెత్తిన భక్తులు



రామేశ్వరం అగ్నితీర్థం వద్ద తర్పణాలు సమర్పించేందుకు గుమికూడిన భక్తులు

చెన్నై, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని రామేశ్వరం సహా తీర్థక్షేత్రాలన్ని తై అమావాస్య సందర్భంగా శుక్రవారం ఉదయం పితృదేవతలకు తర్పణాలు సమర్పించేందుకు వచ్చిన వేలాదిమంది భక్తులతో కిటకిటలాడాయి. రామనాథపురం జిల్లా రామేశ్వరంలో పర్వతవర్ధిని సమేత రామనాథస్వామి ఆలయ సమీపంలోని అగ్నితీర్థం లో పుణ్యస్నానమాచరించి తర్పణాలు సమర్పించడం ఆనవాయితీ. ఈమేరకు తై అమావాస్యను పురస్కరించుకుని శుక్రవారం వేకువజాము 4 గంటలకే రామేశ్వరం ఆలయాన్ని తెరిచారు. 5 నుంచి 5.30 గంటల వరకు స్ఫటికలింగపూజలు జరిగాయి. ఉదయం 10.25 గంటలకు పర్వతవర్ధిని సమేత రామనాథుడు పంచమూర్తుల సమేతంగా ఆలయం నుంచి మధ్యాహ్నం 12.10 గంటలకు అగ్నితీర్థం వద్ద వేంచేశారు. అక్కడ తీర్థవారీ నిర్వహించారు. అదే సమయంలో అగ్నితీర్థం వద్ద వేలాది మంది భక్తులు పితృదేవతలకు తర్పణాలు సమర్పించారు. వివిధ ప్రాంతాల నుంచి రాష్ట్ర రవాణా సంస్థ బస్సుల్లో, వాహనాల్లో విచ్చేసిన భక్తులతో రామేశ్వరం నగరం నిండిపోయింది. ఆలయ ప్రాంగణంలోని 22 తీర్థ బావుల వద్ద జలాలను శిరస్సులపై చల్లుకునేందుకు భక్తులు బారులు తీరారు.

కన్నియాకుమారిలో...

ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన పర్యాటక ప్రాంతం కన్నియాకుమారి సముద్రతీరం వద్ద శుక్రవారం ఉదయం వేలాదిమంది భక్తులు పితృదేవతలకు తర్పణాలు వదిలారు. హిందూ మహాసముద్రం, అరేబియా సముద్రం, బంగాళాఖాతం కలిసే త్రివేణి సంగమ ప్రాంతం వద్ద వేల సంఖ్యలో భక్తులంతా స్నానమాచరించి, శాస్త్రోక్తంగా పితృదేవతలకు తర్పణాలు విడిచారు. తూత్తుకుడి జిల్లా ఏరల్ నుంచి తిరునల్వేలి జిల్లా పాపనాశం వరకు ఉన్న 64 తీర్థఘాట్‌లు, తామ్రభరణి నదీ తీర ప్రాంతం, కారైయారు, సొరిముత్తు అయ్యనార్ ఆలయం తదితర ప్రాంతాల వద్ద కూడా పితృదేవతలకు తర్పణాలు సమర్పించారు. తిరుచ్చి శ్రీరంగం అమ్మా మండపం, అయ్యాలమ్మన్ ఘాట్, గరుడ మండపం వద్ద శుక్రవారం వేకువజామునే భక్తులు తర్పణలు సమర్పించేందుకు గుమికూడారు. కరూరు జిల్లా కావేరి నదీతీరప్రాంతాలు, పుదుకోట శాంతనాథస్వామి ఆలయం, అరంతాగికి సమీపంలోని కడలితీరం ప్రాంతాల్లోనూ వేల సంఖ్యలో భక్తులు తర్పణాలు విడిచారు. ఈరోడ్ జిల్లా దక్షిణ కాశీగా పేరొందిన భవానీ సంగమేశ్వరాలయం కొడుముడి మకుటేశ్వరాలయం, కరుంగళ్‌పాళయం కావేరి నదీతీర ప్రాంతం తదితర తీర్థాల వద్ద కూడా వేకువజాము నుండే భక్తులు పుణ్యస్నానమాచరించి తర్పణాలు సమర్పించారు. ధర్మపురి జిల్లా హొగెనేకల్ జలపాతం వద్ద కూడా భక్తులు పితృదేవతలు తర్పణాలు సమర్పించారు.

తిరుచెందూరు తీరంలో...

తిరుచెందూరు సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయం సమీపంలోని సముద్రతీరం వద్ద పితృదేవతలకు భక్తిశ్రద్ధలతో తర్పణాలు సమర్పించారు. ఈ సందర్భంగా ఆలయాన్ని వేకువజాము నాలుగు గంటలకే తెరిచి ప్రత్యేక పూజలు, దీపారాధన నిర్వహించారు. 6 గంటలకు ఉదయమార్తాండ అభిషేకం, 8.30 గంటలకు తీర్థవారి నిర్వహించారు. తిరుప్పూరు జిల్లా ఉడుమలై సమీపంలో పడమటి కనుమల దిగువనున్న తిరుమూర్తిమలైలోని బ్రహ్మ, విష్ణు, శివాలయ తీర్థఘాట్ వద్దకూడా తర్పణాలు విడిచారు. తారాపురం అమరావతి వాగు వద్ద తర్పణాలు సమర్పించేందుకు పెద్ద సంఖ్యలో గుమికూడారు.





తిరుచెందూరు కడలితీరం వద్ద తర్పణాలు సమర్పణకు గుమికూడిన భక్తులు- కన్యాకుమారి త్రివేణి సంగమ తీరంలో తర్పణాలు సమర్పిస్తున్న భక్తులు

సమాచార దర్శిని

30 పేజీలతో జవాబుపత్రాలు

ఐసిఎఫ్, ఫిబ్రవరి 9: ప్లస్‌టూ పబ్లిక్ పరీక్షల్లో 30 పేజీల జవాబుపత్రాలు అందించాలని ప్రధాన విద్యాధికారులకు ప్రభుత్వ పరీక్ష శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ప్లస్ టూ పబ్లిక్ పరీక్షలు 1వ తేదీ ప్రారంభంకానున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా 8 లక్షల మందికి పైగా విద్యార్థులు పరీక్షల్లో పాల్గొననున్నారు. వారికి హాల్‌టిక్కెట్లు ఈ నెలాఖరులో అందించనున్నారు. ఈ నేపథ్యంలో, పబ్లిక్ పరీక్షలకు జిల్లాలవారీగా ఖాళీ జవాబు పత్రాలను పరీక్ష శాఖ తరలిస్తోంది. ఈ జవాబు పత్రాలను పాఠ్యాంశాల వారీగా విభజించి విద్యార్థులకు అందజేసేలా పరీక్ష శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ఆ ప్రకారం, బోటనీ, జువాలజీలకు తలా 14 పేజీలు, లాంగ్వేజ్, ఇతర పాఠ్యాంశాలకు తలా 30 పేజీలు జవాబుపత్రాలు అందించనున్నారు. ఇది మినహా జాగ్రఫీకి ప్రపంచపటం, చరిత్రకు ఒక భారతదేశం, ప్రపంచమ్యాప్‌లు, స్టాటిస్టిక్స్, బిజినెస్ మ్యాథ్స్ సబ్జెక్టుకు రూల్డ్ పేజీలు అందిస్తారు.

ఆగస్టు వరకు చిరుధాన్యాల కొనుగోలు

ఐసిఎఫ్, ఫిబ్రవరి 9: రైతుల నుంచి చిరుధాన్యాలు కొనుగోలుకు రాష్ట్రప్రభుత్వానికి ఇచ్చిన గడువు ఆగస్టు వరకు పొడిగిస్తూ కేంద్రప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. కేంద్ర ప్రభుత్వం వివిధ పౌష్టికాహార పథకాల కోసం రాష్ట్ర రైతుల నుంచి 17,000 టన్నుల రాగులు కొనుగోలును వినియోగ వస్తువుల వాణిజ్య సంస్థకు అప్పగించింది. ధర్మపురి, కృష్ణగిరి, సేలం, ఈరోడ్ జిల్లాల్లో రాగులు కొనుగోళ్లు గత డిసెంబరులో ప్రారంభం కాగా, 100 కిలోల బస్తాకు కనిష్ఠ మద్దతు ధర రూ.3,846 అందిస్తున్నారు. ఇప్పటివరకు 150 టన్నుల రాగి కొనుగోళ్లు జరగ్గా... కొనుగోలు సీజన్ ఈ నెలతో ముగియనుంది. ఈ ఏడాది అంతా కొనుగోలు చేసేందుకు అనుమతి ఇవ్వాలని వాణిజ్య సంస్థ రాసిన లేఖతో ఆగస్టు వరకు అనుమతిస్తూ భారత ఆహార సంస్థ ఉత్తర్వులు జారీ చేసింది.

రూ.1,500 కోట్ల రుణ బకాయిలు

ఐసిఎఫ్, ఫిబ్రవరి 9: సహకార సంస్థల్లో రూ.1,500 కోట్ల రుణ బకాయిలున్నట్లు అధికారులు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ సహకార బ్యాంకులు, సహకార సంఘాల్లో వ్యవసాయేతర విభాగాల్లో రుణాలు పొంది చెల్లించకుండా జాప్యం చేస్తుండడంతో వారికి నోటీసులు జారీ చేశారు. దీర్ఘకాలిన రుణ బకాయిల వసూలుకు ప్రత్యేక పథకాన్ని గత డిసెంబరులో సహకార శాఖ ప్రారంభించింది. ఈ పథకం కింద రుణాలు అందజేసిన తేదీ నుంచి ఒప్పందం చేసుకున్న రోజు వరకు అసలుకు 9 శాతం వడ్డీ వసూలు చేస్తున్నారు. అదే సమయంలో అదనపు వడ్డీ, అపరాధ వడ్డీ, ఇతర ఛార్జీల వంటివి రద్దు చేస్తున్నారు. పలు సంవత్సరాలుగా రుణాలు చెల్లించకుండా ఉన్న 4.73 లక్షల మందికి సహకార సంస్థల ద్వారా నోటీసులు పంపారు. రుణాలు చెల్లించే వారికి భారీగా రాయితీలు కల్పించనున్నట్లు అధికారులు తెలిపారు.

రూ.475 కోట్లతో రోడ్ల మరమ్మతులు

ఐసిఎఫ్, ఫిబ్రవరి 9: వరద బాధిత జిల్లాల్లో ధ్వంసమైన రోడ్ల మరమ్మతులకు రూ.475 కోట్లు ప్రభుత్వం కేటాయించింది. తూత్తుకుడి, తిరునల్వేలి జిల్లాల్లో భారీవర్షాల కారణంగా 118 ప్రాంతాల్లో రోడ్లు దెబ్బతిన్నాయి. వాటిని తాత్కాలికంగా మరమ్మతులు చేపట్టి వాహన రాకపోకలకు అనుమతించారు. ఈ నేపథ్యంలో, ఆ జిల్లాల సహా 8 జిల్లాల్లో శాశ్వతంగా రోడ్లకు మరమ్మతులకు ప్రభుత్వం రూ.475 కోట్లు కేటాయించింది.

పెంపుడు జంతువులకు నాణ్యమైన చికిత్స

ఐసిఎఫ్, ఫిబ్రవరి 9:మనుషులతో సమానంగా పెంపుడుజంతువులకు ప్రపంచ స్థాయిలో నాణ్యమైన చికిత్సలందించనున్నట్టు డాక్టర్ ఎంజీఆర్ విజ్ఞాన, పరిశోధన సంస్థ ఉపకులపతి గీతాలక్ష్మి తెలిపారు. వెప్పేరిలో ఉన్న వెటర్నరీ కళాశాల ఆసుపత్రిలో అల్ట్రా సౌండ్, ఎండోస్కోపీ, సీటీ స్కాన్ వంటి ఆధునిక వసతులున్నాయని, మూత్రపిండాలు, గుండె, ఎముకల వ్యాధులు, అత్యవసర చికిత్స, కంటి శస్త్రచికిత్స విభాగాలున్నట్లు, వీటితో నాణ్యమైన చికిత్సలందించేలా చర్యలు చేపట్టినట్లు ఆమె తెలిపారు.

పీఆర్వోల బదిలీ

ఐసిఎఫ్, ఫిబ్రవరి 9: జిల్లా సమాచార పౌరసంబంధాల అధికారులు ఆరుగురు బదిలీ అయ్యారు. సహాయ పీఆర్వోలు ఏడుగురు పీఆర్వోలుగా పదోన్నతులు పొందారు. సుకుమార్.. ఈరోడ్‌కు, ఇళంగో.. వేలూరుకు, సతీష్.. విల్లుపురానికి, సెందిల్ కుమార్.. కరూర్‌కు, కరుప్పనరాజవేలు... తిరువళ్లూర్‌కు, లోకనాధన్ కృష్ణగిరికి పీఆర్వోలుగా నియమితులయ్యారు. సహాయ పీఆర్వోగాలు ప్రభాకరన్, వివేక్, బాలాజి, రాజాసెల్వన్, భారతి, రాజప్రకాష్, పేచ్చిముత్తులు పదోన్నతులు పొందారు.

గ్రూప్-4కు ఉచిత శిక్షణ

ఐసిఎఫ్, ఫిబ్రవరి 9: టీఎన్‌పీఎస్సీ గ్రూప్-4 పరీక్షలు ఉచిత శిక్షణ తరగతులు ప్రారంభమయ్యాయి. 6,244 పోస్టుల భర్తీకి గ్రూప్-4 పరీక్షను టీఎన్‌పీఎస్సీ ప్రకటించింది. ఈ పరీక్షకు జిల్లా ఎంప్లాయ్‌మెంట్, వృత్తి మార్గదర్శక కేంద్రాల్లో ఉచిత శిక్షణ తరగతులు అందిస్తున్నారు. నగరంలో గురువారం ఈ తరగతులు ప్రారంభం కాగా, ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు తరగతులు జరుగనున్నాయి.

14 మంది ఇన్‌స్పెక్టర్ల బదిలీ

ఐసిఎఫ్, ఫిబ్రవరి 9: పోలీసు శాఖలో 14 మంది ఇన్‌స్పెక్టర్లు వివిధ ప్రాంతాలకు బదిలీ అయ్యారు. ఆవడి కమిషనర్ కార్యాలయ ఆధ్వర్యంలో పనిచేసే కొరట్టూరు క్రైం విభాగం ఇన్‌స్పెక్టర్ రమణి ఆవడి క్రైం విభాగానికి, పోరూర్ ఎస్సార్‌ఎంసీ ఇన్‌స్పెక్టర్ విజయకుమార్ కొరట్టూరు శాంతిభద్రతల విభాగానికి బదిలీ అయ్యారు. వీరితో పాటూ 14 మంది ఇన్‌స్పెక్టర్లను బదిలీ చేస్తూ కమిషనర్ శంకర్ ఉత్తర్వులు జారీ చేశారు.

ఐటీఐ పరీక్షలకు దరఖాస్తుల ఆహ్వానం

ఐసిఎఫ్, ఫిబ్రవరి 9: రాష్ట్రప్రభుత్వ ఉద్యోగ అవకాశాలు, శిక్షణ శాఖ ఆధ్వర్యంలో పని చేసే ఉత్తర చెన్నై ప్రభుత్వ ఐటీఐలో మార్చిలో పరీక్షలు జరగనున్నాయి. 2017లో రెండేళ్ల వృత్తివిభాగం పరీక్షల్లో పాల్గొనని వారు, ఉత్తీర్ణులు కానివారు మాత్రమే ఉప పరీక్షలు రాసేందుకు అర్హులు. పరీక్షా ఫీజు ఈనెల 15వ తేదీలోపు చెల్లించాలి. పరీక్షల్లో పాల్గొనేందుకు ఆసక్తి ఉన్నవారు ఐటీఐ కేంద్రాన్ని నేరుగా సంప్రదించాలి.

పెరుంగుడి టోల్ గేట్ తొలగింపు

ఐసిఎఫ్, ఫిబ్రవరి 9: మెట్రోరైలు పనులకు అడ్డంగా ఉన్న పెరుంగుడి టోల్‌గేట్‌ను సీఎంఆర్ఎల్ తొలగించింది. ఓఎంఆర్ రహదారిని వినియోగించేందుకు పెరుంగుడి, దురైపాక్కం, కలైంజర్‌రోడ్డు, మేడవాక్కం,నావలూరు ప్రాంతాల్లో టోల్ గేట్లు ఏర్పాటు చేసి రుసుము వసూలు చేస్తున్నారు. చెన్నై కార్పొరేషన్ సరిహద్దులో ఉన్న దురైపాక్కం, పెరుంగుడి టోల్ గేట్లు తొలగించాలని వాహన చోదకులు కోరుతున్నారు. ఈ నేపథ్యంలో, ఓఎంఆర్‌లో 20 కి.మీ దూరం మెట్రోరైలు మార్గం పనులు జరుగుతున్నాయి. దీంతో 2021 సెప్టెంబరు నుంచి పెరుంగుడి, దురైపాక్కం, మేడవాక్కం, కలైంజర్ రోడ్డులో ఉన్న టోల్ గేట్లు, గత ఏడాది అక్టోబరులో నావలూరు టోల్‌గేట్లలో ఫీజు వసూలు నిలిపివేశారు. అయితే అన్ని టోల్ గేట్లు అలాగే ఉండగా, ప్రస్తుతం మెట్రోరైలు పనులకు అంతరాయంగా ఉండడంతో పెరుంగుడి టోల్ గేట్‌ను తొలగించారు.

కోరిన కోర్కెలు తీరుతాయని విశ్వాసం!

- వేప చెట్టుపై బల్లిని చూసేందుకు పోటీపడిన భక్తులు

పెరంబూర్, ఫిబ్రవరి 9: చెట్టుపై ఉన్న బల్లిని చూస్తే తాము కోరిన కోర్కెలు తీరుతాయని భక్తుల నమ్మకం. కొందరు బల్లిని దైవంగా భావించి పూజిస్తుంటారు. పూజ గదిలో బల్లి ఉంటే సుఖశాంతులు, ఆర్థిక ఎదుగుదల ఉంటుందని ప్రజల భావన. అలా, భక్తులు పూజలు అందుకొనే బల్లి, ప్రస్తుతం తంజావూరు బృహదీశ్వర ఆలయానికి వచ్చే వారిని ఆకట్టుకుంటోంది. ప్రపంచ ప్రసిద్ధిచెందిన తంజావూరు బృహదీశ్వర ఆలయంలో ఉన్న కరువూరార్ సన్నిధి వెనుక వేప చెట్టు ఉంది. ఈ సన్నిధిని దర్శించే భక్తులు, వేప చెట్టుపై బల్లి ఉందా? లేదా? అని ఆత్రుతగా చూస్తుంటారు. చెట్టుపై బల్లి కనిపిస్తే తాము కోరుకున్న కోర్కెలు తీరుతాయని వారి విశ్వాసం. అలా, వచ్చే భక్తులు చెట్టు చుట్టూ తిరుగుతూ బల్లి ఎక్కడ ఉందా అని గాలిస్తుంటారు. సహజంగా చెట్టు రంగులోనే బల్లి స్పష్టంగా కనిపించదు. అలా ఎవరైనా భక్తుడు చెట్టుపై బల్లిని గుర్తించిన వెంటనే, మిగిలిన భక్తులకు తెలపడంతో వారు కూడా అక్కడకు చేరుకొని బల్లిని దర్శించుకుంటారు.



చెట్టుపై ఉన్న బల్లిని చూస్తున్న భక్తులు

రాష్ట్రంపై మళ్లీ ఈడీ పంజా

- అపార్ట్‌మెంట్ నిర్మాణ అనుమతులకు రూ.50 కోట్ల లంచమిచ్చిన కేసు
- ఏడుగురు అన్నాడీఎంకే నేతలకు లంచాలు
- ప్రభుత్వ ఉన్నతాధికారులకు కూడా..
- పది ప్రాంతాల్లో ఈడీ అధికారుల తనిఖీలు

అడయార్, ఫిబ్రవరి 9: స్థానిక పెరంబూరులోని బెరాక్స్‌లో బిన్నీ మిల్లు స్థలంలో బహుళ అంతస్తు నివాస భవన సముదాయాలను నిర్మించేందుకు గత అన్నాడీఎంకే ప్రభుత్వంలో అప్పటి మంత్రులు, ఎంపీలకు రూ.50 కోట్ల లంచాలు ఇచ్చి అనుమతులు పొందినట్టు వచ్చిన ఆరోపణల నేపథ్యంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ అధికారులు శుక్రవారం సోదాలు చేశారు. ఈ తనిఖీలు ఏకకాలంలో పది చోట్ల జరిగాయి. ఇందులో గృహ నిర్మాణ సంస్థలకు చెందిన బ్యాంకు లావాదేవీల కీలక దస్త్రావేజులను తనిఖీ చేశారు. బిన్నీ మిల్లు స్థలంలో రెండు బహుళ అంతస్తు గృహ భవనాలు నిర్మించేందుకు వీలుగా 14.16 ఎకరాల స్థలాన్ని రూ.490 కోట్లకు టి.నగర్‌కు చెందిన ల్యాండ్‌మార్క్ హౌసింగ్ ప్రాజెక్టు లిమిటెడ్, కేఎల్‌పీ ప్రాజెక్టు ప్రైవేట్ లిమిటెడ్ సంస్థలు కలిసి కొనుగోలు చేసేలా ఒప్పందాన్ని కుదుర్చుకున్నాయి. ఇందుకోసం అడ్వాన్స్‌గా ల్యాండ్ మార్క్ ప్రాజెక్ట్స్ సంస్థ డైరెక్టర్ ఉదయకుమార్ రూ.20 కోట్లు, కేఎల్‌పీ సంస్థ డైరెక్టర్లు సునీల్ కేట్పాలియా, మనీష్ బార్మర్ రూ.40 కోట్లు చెల్లించారు. ఆ తర్వాత ఈ స్థలాన్ని రూ.370 కోట్లకు రిజిస్ట్రేషన్ చేశారు. అయితే సదరు తప్రాంతంలో భవన నిర్మా ణానికి సీఎండీఏ అనుమతి ఇవ్వలేదు. దీంతో ఈ రెండు నిర్మాణ సంస్థల డైరెక్టర్లు రూ.50 కోట్లను ఏడుగురు ప్రజాప్రతినిధులకు, ఇద్దరు ప్రభుత్వ ఉన్నతాధికారులకు, ఎనిమిది ప్రభుత్వ సంస్థలకు లంచాల రూపంలో చెల్లించి, ప్రాజెక్టును పూర్తి చేశారు. ఇదిలావుంటే, రూ.120 కోట్ల లెక్కల్లో చూపని నగదుపై ఆదాయపన్ను శాఖ అధికారులు విచారణ జరిపారు. ఈ తనిఖీల్లోనే ప్రజా ప్రతినిధులకు రూ.50 కోట్ల మేరకు లంచాలు ఇచ్చినట్టు తేలింది. దీంతో దీనిపై లోతుగా విచారణ జరపాలని మద్రాస్ హైకోర్టు జారీచేసిన ఆదేశాల మేరకు ఏసీబీ అధికారులు కేసు నమోదు చేసి ఈ నెల 1న తనిఖీలు చేశారు. ఆ తర్వాత మనీ లాండరింగ్ చట్టం కింద ఈడీ అధికారులు కేసు నమోదు చేశారు. ఈ అధికారులు శుక్రవారం నుంగంబాక్కంలోని ఉదయకుమార్ నివాసం, కార్యాలయం, పులియంతోపులో ఉన్న సునీల్, మనీష్ నివాసం, కార్యాలయం, ఎంజీఎం గోల్డ్ మద్యం కంపెనీ యజమాని అరవింద్ నివాసం, చింతాద్రిపేటలో ఉన్న ఆడిటర్ గణపతి నివాసం ఇలా మొత్తం 10 ప్రాంతాల్లో ఈడీ అధికారులు సోదాలు చేశారు. ఈ తనిఖీల్లో కీలకమైన ఆధారాలు లభించినట్టు తెలుస్తోంది.

తిరువళ్లూరు జిల్లాలో అన్నామలై పాదయాత్ర

చెన్నై, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): 'ఎన్ మన్... ఎన్ మక్కళ్' పేరుతో బీజేపీ అధ్యక్షుడు అన్నామలై గత యేడాది జూలై 28న ప్రారంభించిన పాదయాత్ర ముగింపు దశకు చేరువైంది. గురువారం ఉదయం ఈ పాదయాత్ర తిరువళ్లూరు జిల్లా తిరుత్తణి నగరంలో ప్రారంభమైంది. వందలాదిమంది కార్యకర్తలతో ఆయన కాలినడకనే వెళ్లి ప్రజలను కలుసుకుని వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రాత్రి శ్రీపెరుంబుదూరుకు చేరుకున్న అన్నామలైకి అక్కడి ప్రజలు, పార్టీ శ్రేణులు ఘనస్వాగతం పలికారు. ఇక శుక్రవారం ఉదయం ఆయన మళ్లీ గుమ్మిడిపూండి నుంచి తన పాదయాత్రను అట్టహాసంగా కొనసాగించారు. గుమ్మిడిపూండి రెట్టిమేడు కూడలి నుంచి పాదయాత్రగా వెళ్లిర హదారికి ఇరువైపులా గుమికూడిన జనం వైపు నమస్కరిస్తూ అన్నామలై బస్ స్టేషన్ చేరుకున్నారు. గుమ్మిడిపూండి అంతటా వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన బీజేపీ కార్యకర్తలతో సందడిగా మారింది. అన్నామలై వర్థిల్లాలి... మోదీ పాలన రావాలి... అంటూ పెద్దపెట్టున నినాదాలు చేశారు. బీజేపీ స్థానిక శాఖ నాయకులు ఆయనను గజమాలలతో సత్కరించారు. ఆ తర్వాత అన్నామలై అక్కడి హోటల్‌లో సాయంత్రం వరకు బసచేశారు. ఆ తర్వాత అక్కడి నుండి ఆవడి, మీంజూరు ప్రాంతాల్లో పాదయాత్రను కొనసాగించారు. పొన్నేరి శాసన సభ నియోజకవర్గం పరిధిలోని మీంజూరు పచ్చయమ్మన్ ఆలయ తోరణం ప్రాంతం వద్ద సాయంత్రం ఐదు గంటలకు పాదయాత్రను ప్రారంభించారు. ముప్పాత్తమ్మన్ ఆలయం వరకూ ఈ యాత్ర కొనసాగింది. ఆ తర్వాత రాత్రి 7 గంటలకు ఆవడి శాసనసభ నియోజకవర్గంలో అన్నామలై పాదయాత్రకు పోలీసులు అనుమతి నిరాకరించారు. దీనితో ఆయన కారులో బయలుదేరి ఆవడిలో ఏర్పాటైన బహిరంగ సభావేదికకు చేరుకున్నారు.



తిరువళ్లూరు జిల్లాలో పాదయాత్రలో ముస్లింలను వెంటబెట్టుకుని నడుస్తున్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలై

అతిథిగృహం ప్రారంభం

వేలూరు, ఫిబ్రవరి 9: స్థానిక అన్నాసాలైలోని అతిథిగృహం ఆవరణలో రూ.7.63 కోట్లతో నిర్మించిన అతిథి గృహాన్ని శుక్రవారం రాష్ట్ర మంత్రులు దురైమురుగన్, ఏవీ వేలు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఆనైకట్టు ఎమ్మెల్యే నందకుమార్, వేలూరు ఎమ్మెల్యే కార్తికేయన్, కార్పొరేషన్ మేయర్ సుజాత ఆనందకుమార్, ఉపమేయర్ సునీల్‌కుమార్, జాతీయ రహదారులు, చిన్న ఓడరేవుల శాఖ అదనపు ప్రధాన కార్యదర్శి ప్రదీప్‌యాదవ్, జిల్లా కలెక్టర్ సుబ్బులక్ష్మి, పీడబ్ల్యూడీ ప్రధాన ఇంజనీర్ ఆయుత్‌ధాక్, రాజశేఖరన్, ఇంజనీర్ జయరామన్, అసిస్టెంట్ ఇంజనీర్ రాజా తదితరులు పాల్గొన్నారు. అలాగే, కాట్పాడి డివిజన్ గాంగేయనల్లూర్ నుంచి సత్తువాచేరి వరకు రూ.90.60 కోట్లతో నిర్మించనున్న వంతెనకు మంత్రులు భూమి పూజ చేశారు. ఇక, కాట్పాడి డివిజన్ మేల్మాన్‌తాంగల్‌లో ఏర్పాటుచేసిన తాత్కాలిక రేషన్ దుకాణాన్ని మంత్రి దురైమురుగన్ ప్రారంభించారు.



అతిథి గృహాన్ని ప్రారంభిస్తున్న మంత్రులు

విహారయాత్రలో విషాదం

సద్దికూడు మడుగులో రాష్ట్ర యువకుడి గల్లంతు

రెండోరోజు కొనసాగిన గాలింపు ● ఆచూకి లేని మృతదేహం

నాగలాపురం, ఫిబ్రవరి 9: తమిళనాడు రాష్ట్రం నుంచి స్నేహితుల బృందం విహారయాత్ర కోసం తిరుపతి జిల్లా నాగలాపురం మండలంలోని సద్దికూడు మడుగు జలపాతానికి రాగా వారిలో ఓ యువకుడు గల్లంతయ్యాడు. కుంద్రత్తూరు మండలంలోని కొవ్వూరుకు చెందిన శ్యాం(20) చెన్నైలోని ఎస్ఆర్ఎం డిగ్రీ కళాశాలలో బీకాం మూడో సంవత్సరం చదువుతున్నాడు. తొమ్మిది మంది స్నేహితు లతో కలిసి గురువారం ద్విచక్రవాహనంపై విహార యాత్ర కోసం సద్దికూడుమడుగు చేరుకున్నారు. సాయంత్రం నీటిలోకి దిగి గల్లంతయ్యాడు. స్నేహితులు నాగలాపురం పోలీసులకు ఫిర్యాదు చేయగా ఎస్ఐ ఓబయ్య సిబ్బందితో సంఘటనా స్థలాన్ని చేరుకుని గాలించారు. అర్థరాత్రి వరకు యువకుడి ఆచూకీ కనిపించపోవడంతో వెనుదిరిగారు. శుక్రవారం ఉదయం సత్యవేడు అగ్నిమాపక సిబ్బంది మడుగు వద్దకు చేరుకుని సాయంత్రం 6 గంటల వరకు గాలించినా మృతదేహం ఆచూకీ లభ్యం కాలేదు. మడుగు లోతుగా ఉండడంతో కష్టంగా మారింది. చీకటి పడడంతో వారు వెనుదిరిగారు. శనివారం గజఈత గాళ్లతో గాలింపు చర్యలు చేపట్టనున్నట్లు పోలీసులు తెలిపారు. మృతదేహం లభ్యం కాకపోవడంతో శ్యామ్ తల్లితండ్రులు కన్నీరుమున్నీరయ్యారు.



శ్యామ్ (ఫైల్‌ఫొటో)



సద్దికూడు మడుగు వద్ద అగ్నిమాపక దళం, పోలీసులు

నేడు వై.రామకృష్ణ సంస్మరణ సభ

చెన్నై, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): ఇటీవల అనారోగ్యంతో కన్నుమూసిన 'అమరజీవి పొట్టి శ్రీరాములు స్మారక సమితి' వ్యవస్థాపక కార్యదర్శి వై.రామకృష్ణ సంస్మరణ సభ శనివారం ఉదయం 11 గంటలకు మైలాపూర్ లజ్‌లోని పొట్టి శ్రీరాములు స్మారక భవనంలో జరగనుంది. 'అమరజీవి పొట్టి శ్రీరాములు స్మారక భవన నిర్వాహక కమిటీ' ఆధ్వర్యంలో జరగనున్న ఈ కార్యక్రమానికి తమిళనాడు ప్రభుత్వ మాజీ ప్రధాన కార్యదర్శి పి.రామ్మోహనరావు ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. ఈ కార్యక్రమానికి అందరూ ఆహ్వానితులేనని కమిటీ అధ్యక్షుడు కాకుటూరు అనిల్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు.

డిసెంబరులోగా అందుబాటులోకి
చెన్నై - బెంగళూరు గ్రీన్ హైవే

కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ

ప్యారీస్, ఫిబ్రవరి 9: చెన్నై - బెంగళూరు మధ్య చేపట్టిన గ్రీన్ హైవే పనులు వచ్చే డిసెంబరు నాటికి పూర్తవుతాయని కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ తెలిపారు. తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల మధ్య ప్రయాణ సమయం తగ్గించేలా 240 కి.మీ దూరానికి ఆరు రోడ్లతో కూడిన గ్రీన్ హైవే పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. ఇందుకోసం కేంద్ర ప్రభుత్వం రూ.18,000 కోట్లు కేటాయించింది. ఈ పనులపై రాష్ట్ర ఎంపీలు పార్లమెంటులో ప్రశ్నోత్తరాల సమయంలో ప్రస్తావించారు. అందుకు మంత్రి నితిన్ గడ్కరీ సమాధానం చెబుతూ... తమిళనాడులో రోడ్ల నిర్మాణ పనుల్లో జాతీయ రహదారుల కమిషన్ ఎదుర్కొంటున్న సమస్యలను వివరించారు. రాజకీయాలకు అతీతంగా రాష్ట్రప్రభుత్వ సహకారంతో ఈ పనులు చేపట్టినట్లు ఆయన తెలిపారు. ముఖ్యమంత్రి స్టాలిన్‌తో సమావేశమైన సందర్భంలో చెన్నై - బెంగళూరు మధ్య జరుగుతున్న హైవే నిర్మాణ పనుల గురించి చర్చించామని, డిసెంబరు నాటికి ఈ పనులు పూర్తవుతాయని కేంద్ర మంత్రి తెలిపారు.

సినీ దర్శకుడి ఇంట్లో చోరీ

ప్యారీస్, ఫిబ్రవరి 9: మదురై జిల్లా ఉసిలంపట్టి సమీపంలోని కోరంపట్టిలో ఉన్న తమిళ సినీ దర్శకుడుమణికంఠన్ ఇంట్లో చొరబడిన గుర్తుతెలియని వ్యక్తులు 5 సవర్ల నగలు, రెండు జాతీయ పతకాలతో ఉడాయించారు. దీనిపై ఆయన గురువారం సాయంత్రం 4 గంటలకు అందజేసిన ఫిర్యాదు మేరకు... ఉసిలంపట్టి నగర పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు. డీఎస్పీ నల్లు నేతృత్వంలోని పోలీసుల బృందం చోరీ జరిగిన ప్రాంతాన్ని పరిశీలించింది. ఆ ప్రాంతంలో నమోదైన వేలిముద్రలను ఫోరెన్సిక్ నిపుణులు సేకరించి, పరారైన నిందితుల కోసం గాలిస్తున్నారు.

మాధవరంలో రెండు శ్మశానవాటికల మూసివేత

ప్యారీస్, ఫిబ్రవరి 9: గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ మాధవరం మండలం 29, 32వ వార్డుల్లో ఉన్న శ్మశాన వాటికలకు మరమ్మతులు చేపడుతున్న కారణంగా ఈనెల 12 నుంచి ఆగస్టు 11వ తేదీ వరకు ఆరు నెలలు మూసి వేయనున్నారు. ఈ రోజుల్లో మాధవరం, కొళత్తూర్, పొన్నియమ్మన్ మేడు తదితర ప్రాంతాలకు చెందిన ప్రజలు 66వ వార్డు పరిధిలో ఉన్న హిందూ శ్మశానవాటిక, సూరపట్టువాసులు 24వ వార్డు పరిధిలో ఉన్న పుళల్ హిందూ శ్మశాన వాటికలు వినియోగించు కోవాల్సిందిగా కార్పొరేషన్ అధికారులు తెలిపారు.



వేలూరులోని వెంకటేశ్వర ఉన్నత పాఠశాలలో జాతీయ నులిపురుగుల దినం సందర్భంగా శుక్రవారం జరిగిన కార్యక్రమంలో విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న జిల్లా కలెక్టర్ సుబ్బులక్ష్మి, ఆరోగ్యశాఖ ఉప డైరెక్టర్ భానుమతి తదితరులు

పుదుచ్చేరిలో పీచు మిఠాయి విక్రయాల నిషేధం

గవర్నర్ తమిళిసై సౌందర్‌రాజన్

పుదుచ్చేరి, ఫిబ్రవరి 9: కేంద్ర పాలిత రాష్ట్రం పుదుచ్చేరిలో పీచు మిఠాలు విక్రయాలను నిషేధిస్తున్నట్టు గవర్నర్ తమిళిసై సౌందర్‌రాజన్ తెలిపారు. పుదుచ్చేరి బీచ్, పర్యాటక ప్రాంతాల్లో ఉత్తరాది యువకులు ప్రజలు, పర్యాటకులకు పీచు మిఠాయి విక్రయిస్తున్నారు. ఈ పీచు మిఠాయి తిన్న పిల్లలు అస్వస్థతకు గురవుతున్నట్లు సమాచారం. దీంతో, ఆహార భద్రతా శాఖ అధికారులు ఇటీవల పలు ప్రాంతాల్లో తనిఖీలు చేపట్టి, పీచు మిఠాయి ప్యాకెట్లు స్వాధీనం చేసుకొని, వాటి నమూనాలను ల్యాబ్‌కు పంపారు. అందులో కర్మాగారాల్లో వినియోగించే నిషేధిత 'రొడామైన్‌బి' రసాయనాలున్నట్లు, వీటి వాడకంతో క్యాన్సర్ వచ్చే అవకాశముందని పరిశోధనల్లో తేలింది. ఈ విషయమై గవర్నర్ తమిళిసై సౌందర్‌రాజన్ విడుదలచేసిన ప్రకటనలో... ఈ రసాయనం కలిగిన పీచు మిఠాయి తినడంవల్ల పిల్లలు అనారోగ్యం పాలవుతారని పరీక్షల్లో తేలిందని, అందువల్ల ఈ తినుబండారం విక్రయాలను నిషేధిస్తున్నామన్నారు. అదే సమయంలో పీచుమిఠాయి తయారీదారులు ఆహారభద్రతాశాఖ అధికారుల నుంచి సర్టిఫికేటు పొంది విక్రయించే వెసులుబాటు కల్పించామన్నారు. కాగా మెరీనా బీచ్‌లో గురువారం సాయంత్రం ఆహార భద్రతా శాఖ అధికారులు, సుమారు 10 మంది యువకులు విక్రయిస్తున్న పీచు మిఠాలు ప్యాకెట్లు స్వాధీనం చేసుకొని, పరిశోధన నిమిత్తం వాటి నమూనాలను ల్యాబ్‌కు పంపారు.

'సీఎంగా ఒక మాట... ప్రధానిగా మరో మాట'!

మోదీపై ఎంపీ కనిమొళి వీడియో వైరల్



పెరంబూర్, ఫిబ్రవరి 9: 'ముఖ్యమంత్రిగా ఒక మాట... ప్రధానిగా మరో మాట' అంటూ డీఎంకే ఎంపీ కనిమొళి తన ఎక్స్‌లో పోస్ట్ చేసిన వీడియో వైరల్‌గా మారింది. బీజేపీ నేతృత్వంలోని కేంద్రప్రభుత్వం గత నెల 31వ తేదీ రాష్ట్రపతి ప్రసంగం తర్వాత పార్లమెంటులో తాత్కాలి బడ్జెట్ ప్రవేశపెట్టింది. ఈ బడ్జెట్‌లో బీజేపీ అధికారంలో లేని రాష్ట్రాలకు కేంద్రప్రభుత్వం తక్కువ నిధులు అందిస్తోందంటూ బుధవారం కర్ణాటక ప్రభుత్వం, గురువారం కేరళ ప్రభుత్వం ఢిల్లీలో నిరసన ప్రదర్శనలు చేపట్టగా, డీఎంకే ఎంపీలు నల్లచొక్కాలు ధరించి పార్లమెంటు ప్రాంగణంలో ఆందోళన చేపట్టారు. ఈ నేపథ్యంలో, గుజరాత్ ముఖ్యమంత్రిగా వ్యవహరించిన మోదీ... అప్పటి కేంద్ర ప్రభుత్వాన్ని విమర్శిస్తూ మాట్లాడిన దృశ్యాలను తన ఎక్స్‌లో, 'ఒక కాలంలో ముఖ్యమంత్రి... ప్రస్తుతం ప్రధాని' అనే కాప్షన్ పెట్టి ఎంపీ కనిమొళి పోస్ట్ చేశారు. ఆ వీడియోలో మోదీ మాట్లాడుతూ... గుజరాత్ రాష్ట్ర ప్రభుత్వం పన్నుల రూపంలో కేంద్రప్రభుత్వానికి రూ.60,000 కోట్లు అందజేస్తోందని, కానీ, కేంద్రం గుజరాత్ ఒక్కోసారి, రూ.8 వేలు, రూ.10 వేలు, రూ.12 వేలు అందజేస్తోందని, గుజరాత్ రాష్ట్ర ప్రభుత్వాన్ని భిక్షగాడుగా భావిస్తున్నారా? కేంద్రప్రభుత్వం నుంచి గుజరాత్ రాష్ట్రం నిధుల కోసం అడుక్కోవాలా? అంటూ మోదీ ప్రసంగించారు. ప్రస్తుతం ఈ వీడియో వైరల్‌గా మారింది.

తహసీల్దార్‌పై దాడి కేసులో
కోర్టు విచారణకు అళగిరి హాజరు

చెన్నై, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): మదురైలో 13 యేళ్లకు ముందు శాసనసభ ఎన్నికల సందర్భంగా తహసీల్దార్‌పై జరిగిన దాడి కేసుకు సంబంధించి మాజీ ముఖ్యమంత్రి కరుణానిధి తనయుడు, కేంద్ర మాజీ మంత్రి ఎంకే అళగిరి మదురై డిస్ట్రిక్ట్ మేజిస్ట్రేట్ కోర్టులో శుక్రవారంజరిగిన విచారణకు హాజరయ్యారు. 2011 ఏప్రిల్‌లో శాసనసభ ఎన్నికల సందర్భంగా మేలూరు సమీపంలోని ఓ ఆలయం వద్ద ఓటర్లకు నగదు పంచుతున్నట్లు ఫిర్యాదులు రావటంతో ఆ ప్రాంతీయ ఎన్నికల అధికారిగా ఉన్న తహసీల్దార్ కాళిముత్తు ఇతర అధికారులు వీడియో కెమెరాలతో ఆ ప్రాంతానికి వెళ్లారు. ఆసమయంలో అళగిరితోపాటు ఆయన అనచరులు తనపై దాడి చేశారంటూ కాళిముత్తు కీళవలైవు పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదుచేశారు. ఆ మేరకు అళగిరి, అప్పటి మదురై డిప్యూటీ మేయర్ మన్నన్, డీఎంకే నాయకులు రఘుపతి, తిరుజ్ఞానంసహా 21మందిపై నాలుగుసెక్షన్ల కింద కేసులు నమోదుచేశారు. ఆకేసు సంబంధించి శుక్రవారం మదురై డిస్ట్రిక్టుమేజిస్ట్రేట్ కోర్టులో జరిగినవిచారణకు అళగిరి సహా నిందితులు హాజరయ్యారు. ఆసందర్భంగా కోర్టు ప్రాంగణం వద్ద అళగిరి మద్దతుదారులు పెద్ద సంఖ్యలో గుమికూడారు. పోలీసులు తగు భద్రత ఏర్పాట్లు చేపట్టారు.



మదురై డిస్ట్రిక్ట్ కోర్టులో అళగిరి

టీసీగా హిజ్రా

- రాష్ట్రంలోనే తొలి నియామకం

పెరంబూర్, ఫిబ్రవరి 9: పలు రంగాల్లో నేడు హిజ్రాలు రాణిస్తున్నారు. ఈ క్రమంలో, రాష్ట్రంలో తొలిసారిగా ఓ హిజ్రా రైల్వే టిక్కెట్ కలెక్టర్‌గా నియమితులయ్యారు. దిండుగల్ జిల్లా రైల్వేస్టేషన్‌లో టిక్కెట్ కలెక్టర్‌గా హిజ్రా సింధు గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈ విషయమై సింధు మాట్లాడుతూ... 'నా స్వగ్రామం నాగర్‌కోయిల్. 19 ఏళ్ల క్రితం కేరళ రాష్ట్రం ఎర్నాకుళంలో రైల్వే ఉద్యోగంలో చేరా. 14 ఏళ్ల క్రితం దిండుగల్‌కు బదిలీ అయి, విద్యుత్ శాఖలో పనిచేశా. ఆ సమయంలో ప్రమాదం జరిగి చేతికి గాయం కావడంతో, విద్యుత్ శాఖ నుంచి కమర్షియల్ శాఖకు బదిలీ చేశారు. టిక్కెట్ కలెక్టర్ శిక్షణ ముగియడంతో గురువారం టీసీగా బాధ్యతలు స్వీకరించా. ఇది నా జీవితంలో మరుపురాని రోజు. పట్టుదలతో చదువుకుంటే ఉన్నత స్థాయి చేరవచ్చు. ఈ లక్ష్యంతో హిజ్రాలు ముందుకు సాగాలని కోరుకుంటున్నా' అని సింధు అన్నారు.



సింధు

పాఠశాలలకు బాంబు బెదిరింపు వ్యవహారం

ఇంటర్‌పోల్ సాయం కోరనున్న పోలీసు శాఖ

పెరంబూర్, ఫిబ్రవరి 9: నగరంలో గురువారం 13 ప్రైవేటు పాఠశాలలకు ఈ-మెయిల్ ద్వారా బాంబు బెదిరింపు వచ్చిన విషయం తెలిసిందే. ఈ వార్త నగర వ్యాప్తంగా దావానంలా వ్యాపించడంతో, భయభ్రాంతులైన తల్లిదండుల హుటాహుటిన ఆయా పాఠశాలలకు వెళ్లి తమ పిల్లలను ఇంటికి తీసుకెళ్లారు. దీంతో, బాంబు బెదిరింపు వచ్చిన ఈ-మెయిల్ చిరునామాను ఆరా తీసేందుకు సైబర్ క్రైం పోలీసులు యత్నించారు. బాంబు బెదిరింపులకు పాల్పడిన ఈ-మెయిల్ చిరునామా గుర్తించడంలో ఇబ్బందులు తలెత్తాయి. విదేశాల నుంచి ప్రైవేటు నెట్‌వర్క్ ద్వారా ఈ మెయిల్ పంపించి ఉండొచ్చని సైబర్ క్రైం పోలీసులు భావిస్తున్నారు. అందువల్ల ఈ వ్యహారంలో కేంద్ర హోం మంత్రిత్వ శాఖ సహాయంతో ఇంటర్‌పోల్ పోలీసులను ఆశ్రయించాలని నగర పోలీసు శాఖ నిర్ణయించింది.

బస్సుపై రాళ్లు రువ్విన వ్యక్తికి మూడేళ్ల జైలు

పెరంబూర్, ఫిబ్రవరి 9: ప్రభుత్వ బస్సుపై రాళ్లు రువ్విన వ్యక్తికి కోర్టు మూడేళ్ల జైలు శిక్ష విధించింది. శివకాశి నుంచి తేనికి గత 2013 జూలై 2వ తేదీ బయల్దేరిన ప్రభుత్వ బస్సు రాత్రి 9 గంటలకు తోటప్పనాయకనూర్ మార్గంగా వస్తోంది. ఆ సమయంలో రోడ్డుపై వస్తున్న రాధాకృష్ణన్ (34) హారన్ మోగించకుండా వస్తున్నారా అంటూ కేకలు వేస్తూ బస్సుపై రాళ్లు విసిరాడు. ఈ ఘటనలో బస్సు అద్దాలు ధ్వంసం కాగా, డ్రైవర్ చేతికి గాయాలయ్యాయి. ఈ ఘటనపై ఉసిలంబట్టి తాలూకా పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసు విచారించిన మదురై ప్రిన్సిపల్ సెషన్స్ కోర్టు న్యాయమూర్తి శివకటాక్షం... నిందితుడు రాధాకృష్ణన్‌కు మూడేళ్ల జైలు, రూ.1,000 జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించారు.

13మంది గిరిజనులకు 'రాట్ ఫీవర్'

ఐసిఎఫ్, ఫిబ్రవరి 9: మదురైలో 13 మంది గిరిజనులు రాట్ ఫీవర్‌కు గురయ్యారు. సేడపట్టి పంచాయతీ యూనియన్ తుల్లుకుట్టినాయకనూర్ పంచాయతీలో ఉన్న మొక్కతాన్‌పారైలో 50 గిరిజన కుటుంబాలు నివసిస్తున్నాయి. 10 రోజుల క్రితం ముగ్గురు పిల్లలు రాట్ ఫీవర్‌కు గురికాగా, ఏలుమలై, ఉసిలంపట్టి ప్రభుత్వాసుపత్రుల్లో చేర్పించి అక్కడ వైద్యుల సూచనల మేరకు మదురై ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్సలు ఫలించక ఓ బాలుడు మృతి చెందాడు. ఈ నేపథ్యంలో, 9 మంది బాలబాలికలు ఉసిలంపట్టి ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతుండగా, గురువారం మరో నలుగురు ఆసుపత్రిలో చేరారు. ఈ విషయమై ప్రభుత్వాసుపత్రి సూపరింటెండెంట్ మణివన్నన్ మాట్లాడుతూ... కలుషిత తాగు నీటి వల్ల ఈ వ్యాధి వ్యాపిస్తుందని, ప్రస్తుతం 13 మంది ఈ వ్యాధికి గురయ్యారని, బాధిత గ్రామాల్లో వైద్యశిబిరాలు ఏర్పాటుచేసి చికిత్సలందిస్తామని తెలిపారు. ఈ వ్యాధికి గురైన వారికి మొదట జ్వరం, వాంతులు, నీరసం వంటి లక్షణాలు కనిపిస్తాయని తెలిపారు.

వెల్లివిరిసిన మతసామరస్యం

గంధ మహోత్సవానికి హిందువుల సారె



ముస్లిం పెద్దలకు సారె అందజేస్తున్న హిందువులు

పెరంబూర్, ఫిబ్రవరి 9: అరుప్పుకోట వాళవందపురం ఖాదిర్ అవులియా దర్గా గంధ మహోత్సవానికి హిందువులు సారె అందజేసి మతసామరస్యం చాటుకున్నారు. ఈ ఉత్సవాలను పురస్కరించుకొని నాడార్ బంధువుల సంక్షేమ కార్యాలయం నుంచి ఖాదిర్ అవులియా దర్గాకు హిందువులు సారెతో ఊరేగింపుగా వెళ్లారు. ప్రవేశద్వారం వద్ద దర్గా నిర్వాహకులు, ముస్లిం మత పెద్దలు వారిని సాదరంగా ఆహ్వానించి, సారె స్వీకరించారు. అనంతరం ఇరువర్గాలు విందులో పాల్గొన్నాయి. కాగా, ఈ దర్గా గంధ మహోత్సవానికి హిందువులు సారె తీసుకురావడం ఇదే మొదటిసారి కావడం విశేషం.

ప్రసాద్ ల్యాబ్ ఎదురుగా కార్లు శుభ్రం చేశా

● నటుడు పుగళ్

ఇదే ప్రసాద్ ల్యాబ్ ఎదురుగా కార్లు శుభ్రం చేశానని, ఇప్పుడు అదే ల్యాబ్ ప్రివ్యూ థియేటర్‌లో తాను హీరోగా నటించిన చిత్రం ఆడియో రిలీజ్ వేడుక జరుగుతోందని హాస్య నటుడు పుగళ్ తెలిపారు. జీ4 స్టూడియోస్ సమర్పణలో ఎస్.రాజారత్నం, డి.జెఫా జోన్స్ నిర్మాణంలో జె.సురేష్ దర్శకత్వంలో 'కుక్ విత్ కోమాలి' ద్వారా ఫేమస్ అయిన పుగళ్ తొలిసారి హీరోగా నటించిన చిత్రం 'మిస్టర్ జూ కీపర్'. పులిని రక్షించడానికి కష్టపడే ఒక సాదాసీదా వ్యక్తి ఎదుర్కొనే సమస్యల చుట్టూ కేంద్రీకృతమై ఈ చిత్రం స్క్రీన్‌ప్లే సాగుతుంది. ఈ చిత్రం ఆడియో, ట్రైలర్ రిలీజ్‌ను తాజాగా చెన్నైలో విడుదల చేశారు. ఇందులో పలువురు సినీ ప్రముఖులు పాల్గొని పుగళ్‌కు శుభాకాంక్షలు తెలిపారు. హీరో పుగళ్ మాట్లాడుతూ... 'ఇదే ల్యాబ్ ఎదురుగా కార్లు శుభ్రం చేసిన నేను... ఇప్పుడు ఇదే ల్యాబ్‌లో నా చిత్రం ఆడియో రిలీజ్ వేడుక జరగడం జీవితంలో మరిచిపోలేని జ్ఞాపకం. ఎంతో సంతోషంగా ఉంది. దర్శకుడు ఒక రోజు నన్ను పిలిచి... నీవు హీరో, పులితో ఫైట్ చేయాలి. పైగా యువన్ శంకర్‌రాజా సంగీతం అని చెప్పడంతో నోటమాట రాలేదు. అయితే, ఒక యేడాది పాటు షూటింగ్ ప్రారంభంకాలేదు. ఆ తర్వాత నిజంగానే ఒక పులిని తీసుకొచ్చి అంబులెన్స్‌లో కట్టేసి నటించమన్నారు. ఒరిజినల్ పులితో కలిసి నటించాను. ఈ చిత్ర కథపై నమ్మకంపెట్టి పూర్తి సహాయ సహకారాలు అందించిన నిర్మాతకు ధన్యవాదాలు. నా సరసన నటించేందుకు అనేక మంది హీరోయిన్లు నిరాకరించినప్పటికీ స్టోరీపై ఉన్న బలమైన నమ్మకంతో సమ్మతించిన హీరోయిన్ షిరిన్‌కు ధన్యవాదాలు' అని అన్నారు. హీరోయిన్ షిరిన్ మాట్లాడుతూ... 'ఇలాంటి చిత్రంలో నటించేందుకు అవకాశం కల్పించిన దర్శకనిర్మాతలకు కృతజ్ఞతలు. హీరోగా మారిన పుగళ్‌కు శుభాకాంక్షలు' అని పేర్కొన్నారు. దర్శకుడు సురేష్ మాట్లాడుతూ.. 'ఈ చిత్రానికి వెన్నెముక యువన్ శంకర్ రాజా. పాతికేళ్ల నుంచి స్నేహితులం. ఈ స్టోరీ తొలుత వినిపించింది యువన్‌కే. ఆ తర్వాత ఓ టీవీ షోలో పుగళ్‌ను చూశా. అపుడే అతన్ని హీరోగా చేసి ఈ సినిమాను తెరకెక్కించాలని నిర్ణయం తీసుకున్నా. పుగళ్‌కు ఇది మంచి అవకాశం. నిజమైన పులితో షూటింగ్ చేయడం ఒక పాఠం. హీరోయిన్ షిరిన్‌కు ధన్యవాదాలు' అని పేర్కొన్నారు. అలాగే, నిర్మాతలు, ఇతర యూనిట్ సభ్యులు ప్రసంగించారు.



'మిస్టర్ జూ కీపర్' ఆడియో రిలీజ్ దృశ్యం

కడలూరులో ఏజీఎస్ కృష్ణాలయ ప్రారంభం



ఏజీఎస్ కృష్ణాలయను ప్రారంభించిన ఐశ్వర్య

తమిళ చిత్రపరిశ్రమలో ప్రముఖ నిర్మాణ సంస్థ ఏజీఎస్.. తన సినిమా థియేటర్లను రాజధాని చెన్నైకు మాత్రమే పరిమితం చేయకుండా ఇతర జిల్లాలకు విస్తరిస్తోంది. ఇందులోభాగంగా 'ఏజీఎస్ కృష్ణాలయ' పేరుతో కడలూరులో ఒక సినిమా థియేటర్‌ను ప్రారంభించింది. 2010లో విల్లివాక్కంలో తొలి థియేటర్‌ను ప్రారంభించిన ఏజీఎస్.. ఆ తర్వాత పాత మహాబలిపురం, టి.నగర్, మదురవాయల్ ప్రాంతాల్లో అత్యాధునిక సౌకర్యాలతో థియేటర్లను నిర్మించగా ప్రస్తుతం చెన్నై నగరంలో 18 థియేటర్లను ఏజీఎస్ గ్రూపు కలిగి ఉంది. అదేవిధంగా రాష్ట్రవ్యాప్తంగా సినీ అభిమానులకు సరికొత్త డిజిటల్ సౌండ్ ఎఫెక్టుతో సినిమాలను ప్రదర్శించేలా అత్యాధునిక సౌకర్యాలతో ఈ థియేటర్లను నిర్మిస్తోంది. ఇందులోభాగంగా, కడలూరులోని కృష్ణాలయ థియేటర్‌తో కలిసి ఏజీఎస్ కృష్ణాలయగా పేరు మార్చి 4కె టెక్నాలజీ, డాల్బీ అట్మాస్‌తో ఇంటర్నేషనల్ సదుపాయాలతో అధునికీకరించింది. ఈ థియేటర్‌ను ఐశ్వర్య కల్పాతి ప్రారంభించగా, ఇందులో తొలి సినిమాగా సూపర్‌స్టార్ రజనీకాంత్ ప్రత్యేక పాత్రలో నటించిన 'లాల్‌సలాం' చిత్రాన్ని శుక్రవారం నుంచి ప్రదర్శిస్తున్నారు.

చిత్రజ్యోతి

యువ టాలెంట్ కోసం 'స్టార్‌డా'

● ప్రచారకర్తగా జీవీ ప్రకాష్‌కుమార్

సినిమా రంగంలోకి అడుగుపెట్టి స్టార్‌గా వెలిగిపోయేందుకు ఉత్సాహంతో ఉరకలు వేసే యువ ప్రతిభావంతుల కోసం 'స్టార్‌డా' పేరుతో ప్లాట్‌ఫాం ప్రారంభమైంది. యంగ్ క్రియేటివ్‌లు తమ టాలెంట్‌ను వివిధ రూపాల్లో వ్యక్తపరుస్తూ ఆ వీడియోలను సోషల్ మీడియాలో షేర్ చేస్తుంటారు. ఇలాంటి 'స్టార్‌డా' యాప్‌లో ఇకపై షేర్ చేయడం వల్ల వారికి సినిమాల్లో అవకాశాలు లభించే అవకాశం ఉంది. ఈ యాప్‌కు బ్రాండ్ అంబాసిడర్‌గా ప్రముఖ సంగీత దర్శకుడు, సినీ హీరో జీవీ ప్రకాష్ కుమార్ వ్యవహరిస్తారు. ఈ యాప్ ప్రారంభోత్సవం గురువారం రాత్రి చెన్నైలో జరిగింది. ఇందులో దర్శకుడు అరుణరాజా కామరాజ్, నటుడు రమేష్ తిలక్, నటి నివేదా సతీష్, నటుడు శ్యామ్‌కుమార్, నిర్మాతలు సీవీ కుమార్, ధనుంజయన్, సినీ డిస్ట్రిబ్యూటర్ శక్తివేలన్, స్టార్‌డా ప్లాట్‌ఫాం సీఈవో నరేంద్రకుమార్ తదితరులు పాల్గొన్నారు. జీవీ ప్రకాష్‌కుమార్ మాట్లాడుతూ, 'నేను చిన్న వయసు నుంచే సినిమా రంగంలో కొనసాగుతూ పలువురు కొత్తవారితో కలిసి పనిచేస్తున్నా. వెట్రిమారన్, అట్లీ, ఏఎల్ విజయ్ వంటి కొత్త దర్శకులతో పనిచేశా. ఇప్పటివరకు 23 చిత్రాల్లో నటించగా, వాటిలో 17 చిత్రాలు డెబ్యూ డైరెక్టర్లు రూపొందించారు. కొత్త నటీనటులు, అప్‌కమింగ్ ప్లేబ్యాక్ సింగర్స్‌తో పనిచేశాను. శీతలపానీయాలు, గ్యాంబ్లింగ్ వంటి వాణిజ్య ప్రకటనల్లో నటించాలని రూ.కోట్లు ఆఫర్ చేస్తున్నప్పటికీ వాటిని తిరస్కరిస్తున్నా. కానీ, బ్యాడ్మింటన్ వంటి ఆటలను ప్రోత్సహించేందుకు బ్రాండ్ అంబాసిడర్‌గా పనిచేస్తున్నా. ఇపుడు స్టార్‌డా కోసం పనిచేయడం ఆనందంగా ఉంది' అన్నారు.


నిర్వాహకులతో జీవీ ప్రకాష్ కుమార్

బాగా సంపాదించిన తర్వాత రాజకీయాల్లోకి రావాలి

● హీరో విశాల్ తండ్రి జీకే రెడ్డి



సినిమాల్లో బాగా సంపాదించి, పెళ్లిచేసుకుని సెటిల్ అయిన తర్వాత రాజకీయాల్లోకి రావాలని తన కుమారుడు విశాల్‌కు తండ్రి జీకే రెడ్డి సూచించారు. ఇటీవల తన రాజకీయ ప్రవేశంపై విశాల్ ఒక ప్రకటన విడుదల చేసి.. కాలమే నిర్ణయిస్తుంది. అవసరమైతే ప్రజలపక్షాన గళం వినిపిస్తా అని ప్రకటించారు. దీనిపై ఆయన తండ్రి జీకే రెడ్డి మాట్లాడుతూ... 'విశాల్‌కు బాల్యం నుంచే ఇతరులకు సాయం చేసే గుణం ఉంది. తన వద్ద డబ్బులు లేకపోయినా ఇతరుల వద్ద అప్పు తీసుకుని సాయం చేస్తుంటాడు. తల్లి పేరుమీద చారిటబుల్ ట్రస్ట్‌ను ఏర్పాటుచేసి అనేక మంది పిల్లలకు సాయం చేస్తున్నాడు. ఇపుడు తన అభిమాన సంఘాన్ని రాజకీయ పార్టీగా మార్చాలన్న ఆలోచనలో ఉన్నారు. కచ్చితంగా రాజకీయాల్లోకి వస్తాడు.... అందులో కూడా విజయం సాధిస్తాడు. రాజకీయాల్లోకి ప్రవేశించకముందే అగ్రహీరోలు విజయ్, సూర్య తరహాలో బాగా సంపాదించాలి. వివాహం చేసుకుని సెటిల్ కావాలి. సంపాదించిన డబ్బుతో రాజకీయాల్లోకి వచ్చి ప్రజా సేవ చేయాలన్నదే నా కోరిక' అని ఆయన తాజాగా వ్యాఖ్యానించారు.

దక్షిణ రైల్వేలో 68వ వారోత్సవాలు



చెన్నై డివిజన్‌కు విన్నర్స్ ట్రోఫీ అంది ఆర్ఎన్ సింగ్ తదితరులు

పెరంబూర్, ఫిబ్రవరి 9: దక్షిణ రైల్వేలో 68వ రైల్వే వారోత్సవాలు శుక్రవారం వేడుకగా నిర్వహించారు. స్థానిక ఐసీఎఫ్ ప్రాంగణంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ హాలులో జరిగిన వేడుకలకు దక్షిణ రైల్వే జనరల్ మేనేజర్ ఆర్ఎన్ సింగ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... మౌలిక సదుపాయాల కల్పన, రైల్వే స్టేషన్ల అభివృద్ధి, ప్రయాణికులకు భద్రత తదితరాలపై ప్రత్యేక దృష్టి సారించామని తెలిపారు. కార్యక్రమంలో భాగంగా డివిజన్, డిపార్ట్‌మెంట్, వర్క్‌షాప్ విభాగాల్లో ఉత్తమ సేవలందించిన అధికారులు, ఉద్యోగులకు జీఎం అవార్డులు అందజేశారు. రైల్వే పనుల్లో ప్రతిభ కనబరుస్తున్న డివిజన్లు, వర్క్‌షాప్‌లు అని మొత్తం 38 షీల్డ్‌లను బహూకరించారు. డివిజన్ స్థాయి ప్రతిభ చూపిన చెన్నై డివిజన్ విన్నర్, తిరుచ్చి డివిజన్‌కు రన్నర్ షీల్డులు బహూకరించారు. కార్యక్రమంలో అడిషినల్ జనరల్ మేనేజర్ కౌషాల్ కిషోర్, ప్రిన్సిపల్ చీఫ్ పర్సనల్ ఆఫీసర్ హరికృష్ణ, పలు విభాగాలకు చెందిన ఉన్నతాధికారులు, డివిజన్ మేనేజర్లు, అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

ఆదిఆంధ్ర అరుంధతీయుల అభ్యున్నతే లక్ష్యం

● టామ్స్ వ్యవస్థాపకులు గొల్లపల్లి ఇశ్రాయేలు


గొల్లపల్లి ఇశ్రాయేలును గజమాలతో సత్కరిస్తున్న నిర్వాహకులు

ప్యారీస్, ఫిబ్రవరి 9: ఆదిఆంధ్రులు, అరుంధతీయులు, పారిశుధ్య కార్మికుల సంక్షేమమే తమ లక్ష్యమని తమిళనాడు ఆదిఆంధ్ర అరుంధతీయ మహాసభ (టామ్స్) వ్యవస్థాపకుడు, జనోదయం విద్య సాంఘిక సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ గొల్లపల్లి ఇశ్రాయేలు పేర్కొన్నారు. ఇశ్రాయేలు శుక్రవారం 59వ వసంతంలోకి ప్రవేశించిన సందర్భంగా స్థానిక పెరియమెట్‌లోని సాల్వేషన్ ఆర్మీ సోషల్ సర్వీస్ సెంటర్ వేదికగా వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా టామ్స్ 23వ రాష్ట్రస్థాయి కార్యనిర్వాహకుల సమావేశం సంస్థ అధ్యక్షుడు నేలటూరు విజయకుమార్ నేతృత్వంలో నిర్వహించగా, అన్ని జిల్లాల నిర్వాహకులు సుమారు 75 మందికి పైగా పాల్గొన్నారు. ఈ సమావేశం ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో పనిచేస్తున్న తాత్కాలిక పారిశుధ్య కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని, అరుంధతీయులకు ఉచిత ఇళ్లపట్టాలు పంపిణీ చేయాలని, రిజర్వేషన్ దామాషా ప్రకారం విద్య, ఉద్యోగ రంగాల్లో అవకాశం కల్పించాలని తదితర తీర్మానాలు ఏకగ్రీవంగా ఆమోదించారు. గొల్లపల్లి ఇశ్రాయేలును రాష్ట్రప్రభుత్వ విద్యుత్ బోర్డు అదనపు కార్యదర్శి జీసీ నాగూర్, 'మాస్' అధ్యక్షుడు, శాస్త్రవేత్త డాక్టర్ కొల్లి రాజు, అఖిల భారత తెలుగు సమాఖ్య ప్రధాన కార్యదర్శి నాయకర్ నందగోపాల్ సహా పలువురు అధికారులు, వివిధ తెలుగు సంఘాల నిర్వాహకులు, టామ్స్, జనోదయం సభ్యులు పాల్గొని ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఇశ్రాయేలు మాట్లాడుతూ... టామ్స్ నిర్వాహకులు, సభ్యుల సహకారంతో 23 ఏళ్లుగా అణగారిన వర్గాల ప్రజల మధ్య సేవ చేయగలుగుతున్నానని అన్నారు. టామ్స్ తరఫున ప్రజలకు మరిన్ని సేవలు అందించేలా న్యాయవాదులు, వైద్యులు, ఐటీ, శానిటరీ, వెల్ఫేర్, యూత్, మహిళలు, విద్యార్థులు, కల్చరల్, స్పోర్ట్స్ తదితర విభాగాలతో పాటు మాట్రిమోనియల్ పథకాన్ని కూడా ప్రవేశపెడుతున్నట్లు తెలిపారు.

ప్రాచీన కట్టడాల మరమ్మతులకు రూ.25 కోట్లు


తంజావూరు మరాఠీ దర్బార్ మండప మరమ్మతు పనులను పరిశీలిస్తున్న రాష్ట్ర పురావస్తు శాఖ డిప్యూటీ డైరెక్టర్ శివానందం

చెన్నై, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో చారిత్రక ప్రసిద్ధి చెందిన ప్రాచీన కట్టడాల మరమ్మతలకు రూ.25 కోట్లు కేటాయించినట్లు రాష్ట్ర పురావస్తు శాఖ డిప్యూటీ డైరెక్టర్ శివానందం తెలిపారు. తంజావూరులో రాష్ట్ర పురావస్తు, ప్రదర్శనల సంస్థ విద్యార్థులకు తంజావూరులో శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నారు. శుక్రవారం ఉదయం ఆయన ఆ తరగతులను తనిఖీ చేశారు. ఆ తర్వాత తంజావూరు అంతఃపురం, మరాఠీ దర్బార్ మండపం వద్ద జరుగుతున్న మరమ్మతులను పరిశీలించారు. ఆ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ... మదురై తిరుమలనాయకర్ మహల్, తరంగంబాడి కోట, రాజ్‌భవన్ సహా రాష్ట్రంలోని ప్రాచీన కట్టడాల మరమ్మతలకు ప్రభుత్వం రూ.25 కోట్ల మేరకు నిధులు కేటాయించిందని చెప్పారు. తంజావూరు వైద్యకళాశాల రోడ్డు ఫ్లైఓవర్ సమీపంలో చోళులు ప్రదర్శనశాల (మ్యూజియం) నిర్మించేందుకు స్థల సేకరణ పూర్తయ్యిందని, త్వరలో నిర్మాణ పనులు ప్రారంభమవుతాయని ఆయన తెలిపారు.

బంగ్లాదేశ్‌కు రేలా ఆసుపత్రి సేవలు

● కుదిరిన అవగాహన ఒప్పందం


రాష్ట్ర ఆరోగ్యశాఖ ముఖ్య కార్యదర్శి గగన్‌దీప్‌సింగ్ బేదీ సమక్షంలో ఒప్పంద పత్రాలు మార్చుకుంటున్న రేలా ఆసుపత్రి, బంగ్లాదేశ్ ఆసుపత్రి ప్రతినిధులు

చెన్నై, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): కాలేయ మార్పిడి శస్త్రచికిత్సలో ప్రపంచ ఖ్యాతిగడించిన రేలా హాస్పిటల్ బంగ్లాదేశ్‌లోని షేక్ ఫజిలితున్నెస్సా ముజీబ్ మెమోరియల్ కేపీజే (ఎస్ఎఫ్ఎంకేపీజే) హాస్పిటల్‌కు తన వైద్యసేవలను విస్తరించనుంది. ఆ మేరకు రెండు ఆసుపత్రుల నడుమ అవగాహన ఒప్పందం కుదిరింది. ఆసుపత్రి సదస్సు హాలులో శుక్రవారం ఉదయం ఏర్పాటైన ప్రత్యేక కార్యక్రమంలో రెండు ఆసుపత్రుల ప్రతినిధులు ఒప్పంద పత్రాలపై సంతకాలు చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ రేలా ఇనిస్టిట్యూట్ అండ్ మెడికల్ సెంటర్ ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ ప్రొఫెసర్ మహమ్మద్ రేలా మాట్లాడుతూ... బంగ్లాదేశ్ ప్రధాని స్వీయ పర్యవేక్షణలో మలేసియాలోని కేపీజే హెల్త్‌కేర్ హాస్పిటల్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఆ ఆసుపత్రిలో నిరుపేదలకు కాలేయి మార్పిడి శస్త్రచికిత్సలను అందించడానికి ఈ ఒప్పందం కుదుర్చుకున్నట్లు తెలిపారు. ఎస్ఎఫ్ఎంకేపీజే ఆసుపత్రిలోని వైద్యులకు కాలేయ మార్పిడి శస్త్రచికిత్సలపై సునిశిత శిక్షణ అందించటమే ఈ ఒప్పందం ప్రధాన ఉద్దేశమని చెప్పారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న రాష్ట్ర ఆరోగ్యశాఖ ముఖ్య కార్యదర్శి గగన్‌దీప్‌సింగ్ మాట్లాడుతూ... అవయవ మార్పిడి శస్త్రచికిత్సల్లో కాలేయ మార్పిడి శస్త్రచికిత్స కష్టంతో కూడుకున్నదన్నారు. సుమారు ఏడెనిమిది గంటలు పడుతుందని, ప్రొఫెసర్ రేలా వంటి వైద్యులే ఆ చికిత్సలను చాకచక్యంగా చేయగలరని పేర్కొన్నారు. ఈ ఒప్పందాన్ని భారత్, బంగ్లాదేశ్, మలేసియా దేశాల నడుమ కుదిరిన అరుదైన ఒప్పందంగా భావించాలన్నారు. కాలేయమార్పిడి శస్త్రచికిత్సలకు రేలా ఆసుపత్రి నిర్వాహకులు ప్రభుత్వానికి అన్ని విధాలా సహకరిస్తున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో రేలా ఆసుపత్రి సీఈఓ డాక్టర్ ఇలంకుమరన్, బంగ్లాదేశ్ డిప్యూటీ రాయబారి షెల్లీ సలేహిన్, ఎస్ఎఫ్ఎంకేపీజే ఆసుపత్రి సీఈఓ మహమ్మద్ తౌఫిక్ బిన్ ఇస్మాయిల్ తదితరులు పాల్గొన్నారు.

హొగెనేకల్‌కు తగ్గిన నీటి రాక



పెరంబూర్, ఫిబ్రవరి 9: హొగెనేకల్‌కు కావేరి నదిలో నీటి రాక తగ్గడంతో జలపాతాలు, కాలువల్లో బండరాళ్లు బయటపడుతున్నాయి. కర్ణాటక రాష్ట్రంలోని కబిని, కృష్ణరాజసాగర్ డ్యాంల నుంచి కావేరి నదిలోకి విడుదల చేసే జలాలను గణనీయంగా తగ్గించారు. ఈ నీరు కర్ణాటక - తమిళనాడు సరిహద్దు ప్రాంతమైన బిల్లిగుండ్లు మీదుగా ధర్మపురి జిల్లా హొగెనేకల్ వద్దకు చేరుకుంటాయి. ప్రస్తుతం కర్ణాటక డ్యాం నుంచి నీటి విడుదల నిలిపివేయడం, కావేరి పరివాహక ప్రాంతాల్లో వర్షాలు కురవకపోవడంతో శుక్రవారం ఉదయం గణాంకాల ప్రకారం హొగెనేకల్ వద్ద నీటి రాక 300 ఘనపుటడుగులుగా ఉంది. దీంతో జలపాతాలు, కాలువ ప్రాంతాలు భారీ బండరాళ్లతో దర్శనమిస్తున్నారు.

హొగెనేకల్ ప్రాంతంలో నీటి రాక తగ్గడంతో బయటపడిన బండ రాళ్లు

ట్రాఫిక్ క్రమబద్ధీకరణలో 'స్కూల్ ట్రాఫిక్ వలంటీర్స్'



స్కూల్ ట్రాఫిక్ వలంటీర్స్‌తో నగర పోలీసు కమిషనర్ సందీప్‌రాయ్ రాథోడ్

పెరంబూర్, ఫిబ్రవరి 9: నగరంలో రోజురోజుకు పెరుగుతున్న ట్రాఫిక్ రద్దీ నియంత్రించేలా గ్రేటర్ చెన్నై పోలీసు శాఖ పలు చర్యలు చేపట్టింది. ప్రధాన రోడ్లు, జంక్షన్లలో ట్రాఫిక్ పోలీసులతో పాటు స్వచ్ఛంద సంస్థల కార్యకర్తలు కూడా ట్రాఫిక్ నియంత్రణలో పాల్గొంటున్నారు. అలాగే, ట్రాఫిక్ నిబంధనలపై ప్రజలు, విద్యార్థులకు పోలీసు శాఖ అవగాహన కల్పిస్తోంది. ఈ నేపథ్యంలో, నగరంలో పాఠశాలల ప్రాంతాల్లో ఉదయం, సాయంత్రం వేళల్లో విద్యార్థులు వెళ్లే సమయంలో ట్రాఫిక్ రద్దీ అధికంగా ఉంటోంది. దీనిని నియంత్రించేలా నగర పోలీసు శాఖ 'స్కూల్ ట్రాఫిక్ వలంటీర్స్' కార్యక్రమాన్ని చేపట్టింది. టి.నగర్‌లోని విద్యోదయ మెట్రిక్యులేషన్ హయ్యర్ సెకండరీ స్కూలు ప్రాంగణంలో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో నగర పోలీస్ కమిషనర్ సందీప్ రాయ్ రాథోడ్ పాల్గొని, ఈ కార్యక్రమాన్ని లాంచనంగా ప్రారంభించారు. ప్యారీస్‌లోని సెయింట్ మెరీస్ హయ్యర్ సెకండరీ స్కూలు, టి.నగర్ విద్యోదయ మెట్రిక్ హయ్యర్ సెకండరీ స్కూలు, గిండి ఐఐటీ క్యాంపస్‌లోని కేంద్రీయ విద్యాలయ, అన్నానగర్ ఎస్‌బీఓఏ మెట్రిక్యులేషన్ హయ్యర్ సెకండరీ స్కూలు తదితర నాలుగు పాఠశాలల్లో తొలివిడతగా 'స్కూల్ ట్రాఫిక్ వలంటరీ' కార్యక్రమం ప్రారంభించారు. విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులతో కూడిన ఈ బృందం పాఠశాలల వద్ద ఉదయం, సాయంత్రం వేళల్లో ట్రాఫిక్ క్రమబద్ధీకరణ చర్యల్లో పాల్గొనడంతో పాటు రోడ్డు నిబంధనలపై ప్రజలకు అవగాహన కార్యక్రమాలు చేపడతాయని నగర పోలీసు శాఖ ప్రకటించింది.

రూ.4.76 కోట్లతో ఆరు ఆలయాల మరమ్మతులు

● మంత్రుల శంకుస్థాపన


తిండల్ వేలాయుధస్వామి ఆలయ మరమ్మతులకు శంకుస్థాపన చేస్తున్న మంత్రులు

చెన్నై, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): ఈరోడ్ జిల్లాలో రూ.4.76 కోట్లతో ఆరు ప్రాచీన ఆలయాల మరమ్మతులకు రాష్ట్ర మంత్రులు ఎస్.ముత్తుసామి, పీకే శేఖర్‌బాబు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా దేవాదాయ శాఖ మంత్రి శేఖర్‌బాబు విలేకరులతో మాట్లాడుతూ... ఈరోడ్ జిల్లా తిండల్ వేలాయుధస్వామి ఆలయంలో ఐదంతస్తుల రాజగోపుర నిర్మాణానికి రూ.2.11 కోట్లు, చెన్నిమలై సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయం వద్ద నిర్మించనున్న గోశాలకు రూ.93లక్షలు, తంగమేడు, తంబికలై అయ్యన్‌స్వామి ఆలయంలో వాణిజ్య సముదాయ నిర్మాణానికి రూ.22లక్షలు ఖర్చు చేయనున్నట్లు చెప్పారు. ఇదే విధంగా భవానీ సంగమేశ్వరాలయంలో గజస్మారక మండప నిర్మాణానికి రూ.51 లక్షలు, సిబ్బంది క్వార్టర్స్ నిర్మాణానికి రూ. 34.50 లక్షలు, అందియూరు చెల్లీశ్వరాలయంలో ప్రహరీ నిర్మించేందుకు రూ.60లక్షలు వ్యయం చేయనున్నట్లు వివరించారు.

మోడీ మళ్లీ ప్రధాని అయితే దేశం తట్టుకోలేదు : డీఎంకే

అడయార్, ఫిబ్రవరి 9: వచ్చే లోక్‌సభ ఎన్నికల తర్వాత నరేంద్రమోదీ మళ్లీ ప్రధాని అయితే దేశం భరించలేదని డీఎంకే నేతలు ఆరోపిస్తున్నారు. త్వరలో జరుగనున్న లోక్‌సభ ఎన్నికల కోసం కోయంబత్తూరు జిల్లా సూళూరులో డీఎంకే కూటమికి చెందిన ద్వితీయ శ్రేణి నేతలు ప్రచారాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... మరోమారు దేశ ప్రధానిగా మోదీ అయితే, దేశ ప్రజలు తీవ్ర కష్టాలు పడతారన్నారు. అందువల్ల వచ్చే ఎన్నికల్లో డీఎంకే - కాంగ్రెస్ కూటమి అభ్యర్థులను గెలిపించాలని కోరుతూ ఇంటింటి ప్రచారం చేస్తున్నారు.

క్యూఎంయూఎల్‌తో హెచ్ఐటీఎస్ అవగాహన ఒప్పందం

అడయార్, ఫిబ్రవరి 9: నగరంలోని హిందుస్థాన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్ (హెచ్ఐటీఎస్) బ్రిటన్‌లోని క్వీన్ మేరీ యూనివర్శిటీ ఆఫ్ లండన్ (క్యూఎంయూఎల్)తో కీలక ఒప్పందాన్ని కుదుర్చుకుంది. చెన్నైలోని హెచ్ఐటీఎస్ క్యాంపస్‌లో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో ఒప్పంద పత్రాలపై హెచ్ఐటీఎస్ ఛాన్సలర్ డాక్టర్ ఆనంద్ జాకబ్ వర్గీస్, క్యూఎంయూఎల్ ప్రెసిడెంట్ అండ్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కోలిన్ బైలీ సంతకాలు చేశారు. ఈ రెండు విద్యా సంస్థలు కలిసి వివిధ అంశాలపై కలిసి పనిచేస్తాయి. ప్రాజెక్టుల పరిశోధన, బోధనా సిబ్బంది, పరిశోధక విద్యార్థుల (స్కాలర్స్) మార్పిడి, షార్ట్ టర్మ్ స్టడీ అబ్రాడ్ ప్రోగ్రామ్స్, పాథ్‌వే ప్రోగ్రాం, సంయుక్త సదస్సులు, అకడమిక్ ఇంటర్న్‌షిప్ వంటి అంశాలపై సంయుక్తంగా పని చేస్తాయి. అంతేకాకుండా, శిక్షణ, విద్య వంటి అంశాల్లో ఉమ్మడి పరిశోధనలు, విజ్ఞానం, వనరుల మార్పిడి వంటి వాటిని మరింత సులభతరం చేయనుంది. ఈ సందర్భంగా డాక్టర్ ఆనంద్ జాకబ్ వర్గీస్ మాట్లాడుతూ... హెచ్ఐటీఎస్ విద్యార్థులకు ప్రపంచ వ్యాప్తంగా ఉన్న టాప్ యూనివర్శిటీలతో ఒప్పందం కుదుర్చుకుని ఉన్నతమైన విద్యా ప్రమాణాలు అందించేందుకు దోహదపడుతుందని పేర్కొన్నారు.



ఒప్పంద కార్యక్రమంలో ఇరుపక్షాల ప్రతినిధులు